సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

మంగళవారం
TUESDAY
10.12.2024
సంచిక: 110
సంపుటి: 16
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

ఋషి

ధర్మం కోసం అక్షర తపస్సు తెలుగు దినపత్రిక

శ్రీకృష్ణుడి మాట

కర్తవ్యం నిర్వహించడంలో సిగ్గు పడకూడదు. మనిషి తన కర్మల వల్ల గుర్తింపును సాధిస్తాడు. సరైన పనిచేసిన వ్యక్తిని ప్రపంచం కీర్తిస్తుంది. నీ కర్తవ్యం నుంచి పారిపోవడం మంచిది కాదు.

ముహూర్తం

మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:39 సూర్యాస్తమయం - సా. 5:38 తిథిజి దశమి తె. 3:41o వరకు సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర మ. 1:19 వరకు యోగం వ్యతిపాత రా. 9:54 వరకు కరణం తైతుల సా. 4:52 వరకు గరజి తె. 3:41o వరకు వర్జ్యం రా. 12:39 నుండి రా. 2:08 వరకు దుర్ముహూర్తం ఉ. 8:51 నుండి ఉ. 9:35 వరకు రా. 10:51 నుండి రా. 11:43 వరకు రాహుకాలం మ. 2:53 నుండి సా. 4:16 వరకు యమగండం ఉ. 9:24 నుండి ఉ. 10:46 వరకు గుళికాకాలం మ. 12:09 నుండి మ. 1:31 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:03 నుండి తె. 5:51 వరకు అమృత ఘడియలు ఉ. 8:59 నుండి ఉ. 10:29 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:31 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published From HYDERABAD || www.rhushinews.com facebook: rhushinews twitter: rhushinews instagram: rhushinews

తల్లి అభయ హస్తం

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

"భవిష్యత్తులో తెలంగాణ తల్లి విగ్రహ నమూనాను మార్చాలన్నా, ఈ కార్యక్రమాన్ని ఎవరైనా అవమానించాలని చూసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నాం. విగ్రహం మార్పు వల్ల తమ భవిష్యత్తుకు అంధకారం ఏర్పడుతుందని కొందరు భయపడుతున్నారు.

– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- తెలంగాణ అంటేనే కవులు, కళాకారులకు పుట్టినిల్లు
- డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు ఇష్టమైన రోజు
- తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకోవడం మన అదృష్టం
- గతంలో పార్టీ కుటుంబం కోసమే ఆలోచించింది
- కాంగ్రెస్ మాత్రం ప్రజల కోసం ఆలోచిస్తున్నది
- పదేళ్లలో బీఆర్ఎస్ అప్పులకుప్పగా మార్చింది
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'టీజీ'గా 'టీఎస్'

సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు 2

తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్

పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

బతుకమ్మే అస్థిత్వం

పేదరాలిలా తెలంగాణ తల్లి రూపం మార్పు

తల్లిని మార్చిన మూర్ఖులు ప్రపంచంలోనే లేరు: కేటీఆర్

- తెలంగాణ తల్లి అంటే సమాజాన్ని జాగృతపరిచిన స్ఫూర్తి
- కాంగ్రెస్ తల్లిని కచ్చితంగా గాంధీభవన్‌కి పంపిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టీకరణ
- మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

"కాంగ్రెస్ సర్కార్ చేసిన అపచారానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు చేద్దాం. ఆ తల్లిని క్షమాపణ అడుగుదాం. ఈ కాంగ్రెస్ మూర్ఖులకు చరిత్ర తెల్వదు. సన్నాసులను క్షమించాలని కోరుదాం.

– బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మూడ్రోజుల పాటు జైపూర్, ఢిల్లీలో రేవంత్ రెడ్డి పర్యటన 3

తెలుగు

తప్పనిసరేం కాదు

9, 10 తరగతుల సిలబస్‌లో మార్పు

8వ తరగతి వరకు నిబంధన అమలు

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం 3

గ్రూప్-2 హాల్ టికెట్ల విడుదల

15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు 3

గోవిందా..

తిరుమల వెంకన్న నామాన్ని కించపరుస్తున్న నేతలు

అదేమైనా తిట్టా?

ప్రతీ విమర్శకు అసంబద్ధంగా దేవుడి నామస్మరణ

రైతుబంధు, కల్యాణలక్ష్మి గోవిందా అంటూ బీఆర్ఎస్ నేతల పాటలు

తీవ్రంగా మండిపడుతున్న హిందూ సంఘాల నేతలు.. మనోభావాలు దెబ్బతీసినందుకు కేసు పెట్టాలని డిమాండ్

"హిందూ ఆచారాలు తిట్లుగా మారిపోతున్న ఉదంతాలు హిందూ సమాజాన్ని తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నాయి. మొన్నటికి మొన్న ఋషి దినపత్రిక సీఈవో గునిశెట్టి సుమన్ రాసిన 'తిట్లుగా హిందూ ఆచారాలు' వ్యాసం దీని గురించే ప్రధానంగా చర్చించింది. హిందూ ఆచారాలను తిట్లుగా వాడటాన్ని తగ్గించాలని, హిందువులే అసంబద్ధంగా దేవుళ్ల పేర్లను వాడుతూ, హిందూ ధర్మాన్ని కించపరిచేలా చేస్తున్నారని ఆయన నొక్కి చెప్పారు.

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఋషి ప్రతినిధి): అయితే.. తాజాగా, సోమవారం బీఆర్ఎస్ నేతలు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కించపరిచే చర్యలో భాగంగా గోవిందా అంటూ పాడిన పాట సరికాదని పలువురు హిందువులు మండిపడుతున్నారు. సోమవారం అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. అయితే, పోలీసులు వారిని అరెస్టు చేసి బస్సులో ఎక్కించారు. ఈ సందర్భంగా 'రైతుబంధు గోవిందా.. రైతుబీమా గోవిందా.. కల్యాణ లక్ష్మి గోవిందా.. షాదీ ముబారక్ గోవిందా.. గోవిందా హరి గోవిందా.. కాంగ్రెస్ వస్తే గోవిందా.. కేసీఆర్ కిట్ గోవిందా.. న్యూట్రిషన్ కిట్టూ గోవిందా.. స్కాలర్ షిప్పులు గోవిందా.. ఫీజు రీయింబర్స్ మెంట్ గోవిందా.. చేపలు పంచుడు గోవిందా.. రేవంత్ వస్తే గోవిందా..' అంటూ పాట పాడారు. దీనికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీమంత్రులు గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఇతర తరువాయి 2 వ పేజీలో...

లాలీపాప్‌లు తింటూ కూర్చుంటామా?

విదేశీ శక్తులు ఆక్రమిస్తే భారతీయులు ఊరుకుంటారా?

బంగ్లాదేశ్‌లో కొందరు చేసే రెచ్చగొట్టే ప్రకటనలు

కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా బెంగాల్ కట్టుబడి ఉంది: మమతా బెనర్జీ

న్యూఢిల్లీ, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశాలపై తమకు హక్కు ఉందంటూ బంగ్లాదేశ్ నేతలు చేసిన వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. విదేశీ శక్తులు ఆక్రమిస్తే భారతీయులేమైనా లాలీపాప్ తింటూ కూర్చుంటారా? అని చురక అంటించారు. ఇలాంటి వ్యవహారాల్లో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా పశ్చిమ బెంగాల్ కట్టుబడి ఉంటుందన్నారు.పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ఆమె మాట్లాడారు. బంగ్లాదేశ్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావించారు. బంగ్లాదేశ్‌లో కొందరు చేసే రెచ్చగొట్టే ప్రకటనలకు స్పందించాల్సిన అవసరం లేదన్నారు. సంయమనం పాటిస్తూ ప్రశాంతంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన దేశ తరువాయి 2 వ పేజీలో...

హిందువుల భద్రతపై ఆందోళనగా ఉన్నాం

బంగ్లాదేశ్‌తో భారత్ స్పష్టీకరణ

ఆ దేశ విదేశాంగ శాఖ కార్యదర్శితో భారత కార్యదర్శి భేటీ 2



చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరుడే

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

చెన్నమనేనికి 30 లక్షల జరిమానా విధింపు 2

ఆర్బీఐ కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

నేటితో ముగియనున్న శక్తికాంత దాస్ పదవీకాలం 2

ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 9666711515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా, rhushinews@gmail.com మెయిల్‌కు బయో డేటా పంపగలరు.

తల్లి అభయ హస్తం

- తెలంగాణ అంటేనే కవులు, కళాకారులకు పుట్టినిల్లు
- డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు ఇష్టమైన రోజు
- తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకోవడం మన అదృష్టం
- గతంలో ఒక పార్టీ తమ కుటుంబం కోసమే ఆలోచించింది
- కాంగ్రెస్ మాత్రం ప్రజల కోసం ఆలోచిస్తున్నది

తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

హైదరాబాద్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయంత్రం హైదరాబాదులో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 20 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. వేదమంత్రాల సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గేయ రచయిత అందెశ్రీని సీఎం సన్మానించారు. గుండుపూసలు, హారం, ముక్కుపుడక, ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్క-సారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారు. వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్న కంకులు తెలంగాణ తల్లి చేతిలో పొందుపరిచారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. సచివాలయం, ట్యాంక్ బండ్ పరిసరాలు జనసముద్రంగా మారాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రోజు అని అన్నారు. సోనియా జన్మదినం రోజే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చేందుకు అంతా కలిసి పోరాడామని అన్నారు. కాంగ్రెస్ వచ్చాక తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ లభించిందన్నారు. డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు ఇష్టమైన రోజని, కృష్ణా, గోదావరి నదులు హైదరాబాద్‌లో ప్రవహించినట్లు ఉందన్నారు. ఈరోజు తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకోవడం మన అదృష్టమని, తెలంగాణ వారికి ఎన్నో అవమానాలు ఎదురయ్యాయని అన్నారు. గతంలో ఒక పార్టీ కేవలం తమ కుటుంబం కోసమే ఆలోచించిందన్నారు. గతంలో ఒక పార్టీ కేవలం తమ కుటుంబం కోసమే ఆలోచించిందని, మా పార్టీ మాత్రం ప్రజల కోసం ఆలోచిస్తుందన్నారు. యావత్ తెలంగాణ మొత్తం పండగ చేసుకునే పర్వదినం డిసెంబర్ 9గా అభివర్ణించారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు చేపట్టి మొదటి ఏడాదిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసుకుందని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేసుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఉమ్మడి రాష్ట్రం సమయంలో తెలంగాణ సంస్కృతిని అవహేళన చేశారని, నేడు మన సంస్కృతి సాంప్రదాయాలు చాటి చెప్పేలా తెలంగాణ తల్లిని ఏర్పాటు చేసుకున్నామన్నారు. గత పాలకులు కుటుంబం గురించి ఆలోచించారే కానీ యావత్ తెలంగాణ గర్వించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలన్న ఆలోచనకు నోచుకోలేదంటూ బీఆర్ఎస్ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. తాను తెలంగాణ తల్లిని చూసిన సమయంలో తన తల్లిని చూసిన భావన కలిగిందని, అదే భావన యావత్ తెలంగాణ కలిగే విధంగా తెలంగాణ తల్లిని రూపొందించినట్లు తెలిపారు. తెలంగాణ అంటేనే కవులు, కళాకారులకు పుట్టినిల్లని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తాము 'టీఎస్'ను 'టీజీ'గా మార్చామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యమం ఉవ్వెత్తున ఉన్న రోజుల్లో అందరూ 'టీజీ' అని రాసుకున్నారని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వం 'టీఎస్' అని తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతిచోట 'జయ జయహే తెలంగాణ' వినిపించేదని, కానీ రాష్ట్రం వచ్చాక ఆ గేయానికి గౌరవం దక్కలేదని విమర్శించారు. అందుకే తాము ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించామన్నారు. తెలంగాణ పదేళ్ల పాటు వివక్షకు గురైందన్నారు. ఎందరో కవులు, కళాకారులు ఉద్యమానికి ఊపిరిలూదారని, వారిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని తాము సంక్షేమం వైపు నడిపిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో ఎందరో కవులు, కళాకారులు, రచయితలు వారి పాటలతో యావత్ తెలంగాణ యువతను చైతన్యపరిచి ఉద్యమం వైపు సాగించడంతోనే తెలంగాణ సాధ్యమైందని సీఎం అన్నారు. తెలంగాణ కోసం గొప్ప కవులు, కళాకారులు కృషి చేశారని, వారిని సన్మానించుకోవడం సత్కరించుకోవడం మన బాధ్యతగా సీఎం పేర్కొన్నారు.వారిలో గూడా అంజయ్య, గద్దరన్న, బండి యాదగిరి, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, పాశం యాదగిరి, యాదగిరి రావులకు ఫ్యూచర్స్ సిటీలో 300 గజాల స్థలము, ప్రభుత్వం నుండి కోటి రూపాయల ఆర్థిక సాయం, తామర పత్రాన్ని కూడా అందజేస్తున్నట్లు సీఎం బహిరంగ సభ సాక్షిగా ప్రకటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పదేళ్లలో బీఆర్ఎస్ అప్పులకుప్పగా మార్చిందని దుయ్యబట్టారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చేందుకు అంతా కలిసి పోరాడామని, కాంగ్రెస్ వచ్చిన తర్వాతే రాష్ట్ర ప్రజలకు ఎంతగానో స్వేచ్ఛ లభించిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించామని, అలాగే రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘటన కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులకు రూ.64 వేలకోట్ల వడ్డీ చెల్లించామని, ఇకపై ప్రతిఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు భట్టి తెలిపారు. ఇప్పటివరకు ఎవరూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టలేదని, తొలిసారి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రోన్ షో ప్రజలను ఆకట్టుకుంది. ఈ డ్రోన్ షో ద్వారా ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రవేశపెట్టిన పథకాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేయడం విశేషం. ప్రజా పాలన ముగింపు ఉత్సవాల సందర్భంగా ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలన్నీ జనసంద్రంగా మారాయి. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.

చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరుడే

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

చెన్నమనేనికి రూ.30 లక్షల జరిమానా విధింపు

హైదరాబాద్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): వేములవాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత చెన్నమనేని రమేశ్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రమేశ్ జర్మన్ పౌరుడేనని హైకోర్టు నిర్ధారించింది. పౌరసత్వం కేసులో దాఖలైన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ కు రూ. 30 లక్షల జరిమానా విధించింది. రూ. 25 లక్షలు ప్రస్తుత ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు చెల్లించాలని, మరో రూ. 5 లక్షలు హైకోర్టు న్యాయసేవాధికార సంస్థకు చెల్లించాలని ధర్మాసనం ఆదేశించింది. నెలలోపు జరిమానా చెల్లించాలని స్పష్టం చేసింది.చెన్నమనేని జర్మనీ పౌరుడిగా ఉంటూ ఎమ్మెల్యేగా గెలిచారని కోర్టు తీర్పు ఇచ్చింది. తప్పుడు పత్రాలతో గత 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించారని వ్యాఖ్యానించింది. తప్పుడు సమాచారంతో చెన్నమనేని రమేశ్ ఎన్నికల్లో పోటీ చేశారని కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న ఆది శ్రీనివాస్ గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రమేశ్ వేములవాడ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు గెలుపొందారు. 2009లో తెలుగుదేశం పార్టీ నుంచి, ఆ తర్వాత ఉపఎన్నికతో కలిపి 2010 నుంచి 2018 వరకు మూడుసార్లు విజయం సాధించారు. చట్టం ప్రకారం భారతీయ పౌరులు కాని వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు లేదా ఓటు వేసేందుకు అవకాశం లేదు. మాజీ ఎమ్మెల్యే రమేశ్ జర్మన్ పాస్‌పోర్ట్‌ను కలిగి ఉన్నారని, అది 2023 వరకు చెల్లుబాటులో ఉందని 2020లో కేంద్రం హైకోర్టుకు తెలియజేసింది. అయితే రమేశ్ తన దరఖాస్తులో వాస్తవాలను దాచిపెట్టిన కారణంగా భారతీయ పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. రమేశ్ తప్పుడు పత్రాలతో భారత ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించారని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ హైకోర్టుకు తెలిపింది. హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలను సవాల్ చేస్తూ రమేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జర్మన్ పాస్‌పోర్ట్ సరెండర్‌కు సంబంధించిన వివరాలను, జర్మన్ పౌరసత్వాన్ని వదులుకున్నట్లు రుజువు చేస్తూ అఫిడవిట్‌ను దాఖలు చేయమని హైకోర్టు రమేశ్ ను ఆదేశించింది. ఈ కారణంతో 2013లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రమేశ్ ఉపఎన్నిక విజయాన్ని రద్దు చేసింది. దీంతో రమేశ్ సుప్రీం కోర్టును ఆశ్రయించి స్టే విధించింది. స్టే అమల్లో ఉండగానే 2014, 2018 ఎన్నికల్లో చెన్నమనేని ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు.

గోవిందా.. అదేమైనా తిట్టా

తరువాయి 2 వ పేజీలో...

బీఆర్ఎస్ నేతలు కోరస్ పలికారు. ఈ వీడియో నెట్టింట్లో వైరల్ అయ్యింది. ప్రభుత్వాన్ని విమర్శించడంలో తప్పులేదని.. కానీ, ఈ క్రమంలో దేవుళ్ల పేర్లను అసంబద్ధ సందర్భాల్లో వాడటం ఏమిటని హిందూ సంఘాల నేతలు మండిపడుతున్నారు. గోవిందా అంటే.. అంతా పోయినట్లే అన్నవిధంగా వాడటం ఎంత వరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోవింద నామాన్ని తప్పుగా వాడి, మనోభావాలు దెబ్బతీసినందుకు కేసు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మరోసారి గోవింద నామాన్ని తప్పుగా వాడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లాలీపాప్‌లు తింటూ కూర్చుంటామా?

తరువాయి 2 వ పేజీలో...

విదేశాంగ కార్యదర్శి ప్రస్తుతం బంగ్లాదేశ్ లో ఉన్నారని, అనవసరంగా ఇక్కడి వారు ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దన్నారు.బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై జరుగుతోన్న దాడులు, అక్కడి నేతల వ్యాఖ్యలను బెంగాల్‌లోని ఇమామ్‌లు కూడా ఖండిస్తున్నట్లు చెప్పారు. అక్కడ పరిస్థితులు మరింత దిగజారితే అక్కడి మన బంధువులు, మిత్రులపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఏదైనా మాట్లాడితే సంయమనం పాటించాలన్నారు. పరిస్థితులు దిగజారకుండా చూడాలన్నారు. పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశాలపై తమ దేశానికి హక్కులు ఉన్నాయని ఇటీవల ఢాకాలో ఏర్పాటు చేసిన సభలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఇది చర్చనీయాంశంగా మారింది.

హిందువుల భద్రతపై ఆందోళనగా ఉన్నాం

- బంగ్లాదేశ్‌తో భారత్ స్పష్టీకరణ
- ఆ దేశ విదేశాంగ శాఖ కార్యదర్శితో భారత కార్యదర్శి భేటీ

ఢాకా, డిసెంబర్ 9 (ఋషి ప్రతినిధి) : బంగ్లాదేశ్‌లో హిందువులు, మైనారిటీల భద్రతపై ఆందోళనగా ఉన్నామని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ స్పష్టం చేశారు. బంగ్లా-భారత్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో ఉద్రిక్తతలు తలెత్తడంతో చర్చలు జరిపేందుకు ఆయన బంగ్లాదేశ్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. బంగ్లా విదేశాంగశాఖ కార్యదర్శి మహమ్మద్ జషీముద్దీన్, విదేశాంగశాఖ సలహాదారుతో తౌహిద్ హుస్సేన్‌తో జరిగిన భేటీలో ఆ దేశంలోని హిందువులు, మైనారిటీల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసినట్లు మిశ్రీ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై.. ముఖ్యంగా ఇస్కాన్ ప్రచారకర్త చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్ గురించి చర్చించినట్లు తెలిపారు. బంగ్లాదేశ్ దళాలు భారత సరిహద్దుల్లో డ్రోన్ల మోహరించిన విషయంపై మాట్లాడామన్నారు. 'బంగ్లాదేశ్‌తో సానుకూల, నిర్మాణాత్మక, ప్రయోజనకరమైన సంబంధాన్ని భారత్ కోరుకుంటోందని తెలిపాము. ఇక్కడి యూనస్ ప్రభుత్వంతో కలిసి పని చేయాలని ఎదురు చూస్తున్నాం' అని మిశ్రీ వెల్లడించారు.

ఆర్బీఐ కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

- నేటితో ముగియనున్న శక్తికాంత దాస్ పదవీకాలం

న్యూఢిల్లీ,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆర్బీఐ గవర్నర్ గా బాధ్యతలు నిర్వర్తించిన శక్తికాంత దాస్ స్థానాన్ని సంజయ్ మల్హోత్రా భర్తీ చేయనున్నారు. శక్తికాంత దాస్ ఆర్బీఐ గవర్నర్ గా 2018 డిసెంబరు 12న బాధ్యతలు చేపట్టారు. ఆయన మూడేళ్ల పదవీకాలం పూర్తయినప్పటికీ, మరికొన్నాళ్ల పాటు పదవీకాలం పొడిగించారు. పొడిగించిన పదవీకాలం రేపు డిసెంబరు 10తో ముగియనుంది. శక్తికాంత దాస్ స్థానంలో ఆర్బీఐ పగ్గాలు అందుకోబోతున్న సంజయ్ మల్హోత్రా పదవీకాలం బుధవారం ప్రారంభం కానుంది. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఈ మేరకు ఆమోద ముద్ర వేసింది. సంజయ్ మల్హోత్రా రిజర్వ్ బ్యాంకుకు 26వ గవర్నర్ గా సేవలు అందించనున్నారు. సంజయ్ మల్హోత్రా ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా ఉన్నారు. ఆయన 1990 బ్యాచ్ రాజస్థాన్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. ఆయన ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్ సైన్స్ లో ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకున్నారు. అమెరికాలోని ప్రఖ్యాత ప్రిన్స్ టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీ సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ అందుకున్నారు. సివిల్స్ రాసి ఐఏఎస్ అయిన సంజయ్ మల్హోత్రా. తన 33 ఏళ్ల కెరీర్ లో విద్యుత్, ఆర్థిక, పన్నులు, సమాచార సాంకేతికత, గనులశాఖలో విధులు నిర్వరించారు.

బతుకమ్మ అస్థిత్వం

పేదరాలిలా తెలంగాణ తల్లి రూపం మార్పు... తల్లిని మార్చిన మూర్ఖులు ప్రపంచంలోనే లేరు

తెలంగాణ తల్లి అంటే సమాజాన్ని జాగృతపరిచిన స్ఫూర్తి.. కాంగ్రెస్ తల్లిని కచ్చితంగా గాంధీభవన్‌కి పంపిస్తాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టీకరణ.. మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

హైదరాబాద్, డిసెంబర్ 9 (ఋషి ప్రతినిధి) : హంతకులే సంతాప సభలు పెట్టినట్టు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లిపైనా కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినాక తెలంగాణ ప్రజల బతుకులు నాశనం చేశారని, ఇప్పుడు తెలంగాణ బతుకమ్మను కూడా నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గండిమైసమ్మ సమీపంలో నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన కేటీఆర్.. పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతూ.. ' తెలంగాణ తల్లి ఔన్నత్యాన్ని, గౌరవాన్ని తగ్గించేలా పేదరాలి లెక్క రాష్ట్రాన్ని దివాలా తీసిన తీరుగా రూపొందించిన ఈ దివాళకోరు పాలకులు తమ భావ దారిద్ర్యాన్ని చూపించారు. తల్లిని మార్చిన మూర్ఖులు ప్రపంచంలో ఎవరూ లేరు.. కానీ తెలంగాణ తల్లిని మార్చిన దరిద్రులు తెలంగాణలో ఉన్నారు. తెలంగాణ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో తెలంగాణ తల్లి విగ్రహాలు ఉన్నాయి. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చమని ఈ ప్రభుత్వాన్ని ఎవరు అడిగారు? ప్రభుత్వాలు మారినప్పుడు ప్రజల తలరాతలు మారాలి కానీ తల్లులు మారుతారా? ప్రభుత్వాలు మారినప్పుడు భరతమాత గానీ, తెలుగు తల్లి గానీ మారిందా? తెలంగాణ తల్లి అంటే ఒక వ్యక్తి, ఒక వ్యవస్థ, ఒక పార్టీ కోసం సంబంధించినది కాదుబీ మొత్తం తెలంగాణ సమాజాన్ని జాగృతపరిచిన గొప్ప స్ఫూర్తి. ఇప్పటికే తెలంగాణలో బతుకమ్మ చీరలను మాయం చేసిన ప్రభుత్వం, తెలంగాణ పథకాలను మాయం చేసిన ప్రభుత్వం, మొత్తం తెలంగాణనే మాయం చేయాలని కుట్ర చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా, బీఆర్ఎస్ భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయం. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన మొదటి రోజే సచివాలయం ముందు ఉన్న రాహుల్ గాంధీ తండ్రి విగ్రహాన్ని గాంధీభవన్‌కి పంపిస్తాం. ఈరోజు కాంగ్రెస్ తల్లిని పెట్టి తెలంగాణ పేరుతో మోసం చేస్తున్నారో, ఆ కాంగ్రెస్ తల్లిని గాంధీభవన్ పంపిస్తాం. కాంగ్రెస్ తల్లి భస్మాసుర హస్తం చూపిస్తూ అభయహస్తం అంటూ మోసం చేస్తుంది. అరచేతిలో వైకుంఠం చూపించి ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేస్తోంది ఇదే కాంగ్రెస్ తల్లి. తెలంగాణ ప్రజలు మోసపడేటట్లు చేసిన కాంగ్రెస్ తల్లిని కచ్చితంగా గాంధీభవన్ కి పంపిస్తాం. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని, కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని పంపించడం ఖాయం అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలి. ఈరోజు ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించిన మేడ్చల్ జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుతుబుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ గారికి మరియు పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ తల్లి విగ్రహ రాజకీయానికి నిరసనగా రేపు భారత రాష్ట్ర సమితి పలు శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపడుతుంది. ఈ ప్రభుత్వం చేసిన అపచారానికి నిరసనగా మంగళవారం తెలంగాణలో ఉన్న ప్రతి తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకాలతో పాటు పంచామృత అభిషేకాలు చేయాలి. కాంగ్రెస్ పార్టీ చేసిన అపచారానికి, 'కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ చరిత్ర తెలీదు' అని తెలంగాణ తల్లిని వేడుకుందాం, క్షమించమని అడుగుదాం. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమకారుడు, భారత రాష్ట్ర సమితి కార్యకర్త ప్రతి ఒక్కరు తమ వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో తెలంగాణ తల్లి చిత్రాన్ని ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టుకోవాలి' అని పిలుపునిచ్చారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలే ముఖ్యం

ఎక్కడైనా తల్లికి కిరీటం ఉంటుందా

తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా గాంధీ

విగ్రహ ఏర్పాటు, రూపకల్పనపై అసెంబ్లీలో మంత్రుల వివరణ

హైదరాబాద్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): తెలంగాన తల్లి రూపం, విగ్రహ ఏర్పాటుపై సిఎం రేంవత్ రెడ్డి చేసిన ప్రకటనపై అసెంబ్లీలో వాడీవేడీ చర్చ సాగింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రులు అన్నారు. సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడు తూ..ఇది తెలంగాణ రాష్ట్ర ప్రకటన రోజు.. నాలుగు కోట్ల ప్రజల కోరిక తీరిన రోజు అని అభివర్ణించారు. ఈ విషయాన్ని సభలో ప్రతిపక్ష నేత గతంలో స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. గత పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు ఏమీ రాలేదని చెప్పారు. అమ్మలాంటి తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకుంటున్న ఈరోజు.. సభకు వచ్చి శుభాకాంక్షలు చెప్పేది పోయి.. బయట నిరసనలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. వారికి తెలంగాణపై ప్రేమ లేదని, సొంత ఎజెండాతో పనిచేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ తల్లి అంటే దేవతలా కాదు– మన ఇంట్లో అమ్మలా ఉండాలని తెలిపారు. తెలంగాణ తల్లి రూపంపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ కు లేదని మంత్రి కోమటి రెడ్డి అన్నారు. తెలంగాణ రాదనుకున్న సమయంలో నాలుగుకోట్లు మంది ప్రజల ఆకాంక్ష నెరవేర్చి తల్లి సోనియా గాంధీ అన్నారు. తెలంగాణ ఇచ్చిన దేవతకు శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు చరిత్రలో నిలిచి పోయిన రోజు అన్నారు. మా ముద్దు బిడ్డ శ్రీకాంతాచారి ఎల్బీనగర్ చౌరస్తాలో కాల్చుకుని జై తెలంగాణ అనే నినాదంతో నాలుగు రోజులు మృత్యువుతో పోరాటం చేసి మృతి చెందాడని అసెంబ్లీ లో గుర్తు చేసుకున్నారు. తెలంగాణ తల్లి అంటే చాకలి ఐలమ్మ లాగో, మన పల్లెటూరి తల్లిలాగో ఉంటుందని భావిస్తే.. ఇదేంటి ఇలా ఉందనిపించిందన్నారు. మన పోరాటాలు, ఉద్యమాలు, శ్రమజీవులకు ప్రతీకలైన వ్యవసాయం చేసుకునే మన తల్లిలాగ ఉండాలని ఇవ్వాల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నూతన తెలంగాణ తల్లిని ఆవిష్కరిం చిందని తెలిపారు. తెలంగాణ అంటే ఆత్మగౌరవం, స్వేచ్ఛా, చైతన్యం.. కానీ, గత పదేండ్లలో జరిగిన సంఘటనలు మనకు మాయని మచ్చల్లా వెంటాడు తున్నయన్నారు. అందుకే, ఇప్పుడు తెలంగాణ అస్థి త్వాన్ని సరైన స్థానంలో నిలబెట్టాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ఈ క్రమంలోనే మన అస్థిత్వానికి ప్రతీకలు, నిజాయితీకి నిలువుటద్దా లు, కష్టానికి ప్రతిరూపాలైన వ్యవసాయం చేసుకునే స్త్రీమూర్తిని.. పోలిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించామన్నారు. తెలంగాణ తల్లి

నమూన విడుదల చేయగానే.. తలపై కిరీటం లేదు, పట్టుచీర లేదు.. తెలంగాణ అస్థిత్వాన్ని ఆగం చేస్తున్నరని కొందరు కామెంట్స్ చేస్తున్నారని మండిపడ్డారు.మన తల్లికి కిరటం లేదు.. మన తల్లికి మెడలో నెక్లేస్ లేదు.. అచ్చ తెలంగాణ మహిళను పోలి ఉంటే ఆస్తిత్వం దెబ్బతిందా? అని ప్రశ్నించారు. కిరీటం లేదని అమ్మను అమ్మ కాదంటమా? ఇదెక్కడి వాదన అని అసెంబ్లీలో కోమటి రెడ్డి మండిపడ్డారు. మంత్రిగా.. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకునిగా.. నేను వాళ్లకు ఒక మాట చెప్పదల్చు కున్న అన్నారు. రాజకీయ ఎదుగుదల కోసం తెలంగా ణ పేరు తొలగించుకునే అవకాశవాద పార్టీ కాదు కాంగ్రెస్ అన్నారు. ?రాజకీయాల కోసం తెలంగాణను తీసేసి బీఆర్ఎస్ అని పెట్టుకున్నవాళ్లకి తెలంగాణ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. ఈ రాష్ట్రంలో పార్టీ పేరుకు ముందు తెలంగాణ అని రాసుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. ఇకపోతే తెలంగాణ రావడానికి కారణం సోనియా గాంధీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ చిహ్నంలో మార్పు జరగలేదన్నారు. తెలంగాణ గీతాన్ని రూపొందించి అధికారికంగా ఉపయోగిస్తున్నట్లు వివరించారు. గతంలో ఉన్న విగ్రహాలు పార్టీకి సంబంధించినవని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ప్రభుత్వపరంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం లో ఏర్పాటు చేస్తున్నామని.. రాష్ట్ర ప్రజల భావోద్వేగా లకు అనుగుణంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఇటీవల వరదలు వస్తే కేంద్రం కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని విమర్శించారు. కేంద్రం నుంచి నిధుల సాధనకు అందరం కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సొంత అజెండాతో తెలంగాణ తల్లి విగ్రహం చుట్టూ రాజకీయాలు చేస్తు న్నారని మంత్రి సీతక్క విమర్శించారు. తమ ప్రభుత్వం రూపొందించిన విగ్రహంలో రాష్ట్ర ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం, పోరాటం, శ్రమైక జీవనరూపం, ఆశీర్వాదం కలగలిసిన నిండైన రూపముందని చెప్పారు. శాసనసభలో సీతక్క మాట్లాడారు.'తెలంగాణ తల్లి విగ్రహాన్ని మారుస్తున్నామంటూ భారాస, భాజపా నేతలు మాపై విమర్శలు చేస్తున్నారు.

విగ్రహంపై కావాలనే కొందరు రాజకీయం

ఃపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్

హైదరాబాద్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): తెలంగాణ తల్లి విగ్రహాన్ని కావాలనే కొందరు రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్. తెలంగాణ తల్లి విగ్రహం.. అచ్చం తెలంగాణ ఆడపడుచు, తల్లి మాదిరిగా ఉందన్నారు. నిజమైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ఉందన్నారు. దయచేసి దీన్ని రాజకీయం చేయవద్దని సూచన చేశారు. రూపు దిద్దుకున్న తెలంగాణ విగ్రహం శాశ్వతంగా ఉండేలా అవసరమైతే చట్టం తేవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరోవైపు తెలంగాణకు సోమవారం (డిసెంబర్ 9) ప్రత్యేకమైన రోజుగా వర్ణించారు టీపీసీసీ చీఫ్. ఒకటి పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినం రోజు, 2009 డిసెంబర్ 9న తెలంగాణ ప్రక్రియ ప్రారంభించిన రోజుగా ఇదేనని గుర్తు చేశారు. తెలంగాణలో ఇవాళ చరిత్రాత్మకమైన రోజుగా వర్ణించారు. రాష్ట్ర ప్రజల తరపున సోనియాగాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాసనమండలి ఆవరణంలో మీడియాతో మాట్లాడారాయన. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహానికి మద్దతు తెలుపుతున్నామని తెలిపారు.

రేవంత్ దుశ్చర్యకు తెలంగాణ కన్నీళ్లు

ఃఉద్యమతల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారు : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): తెలంగాణ తల్లి రూపురేఖల్ని మార్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించడం దురదృష్టకరమన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ దుశ్చర్యకు తెలంగాణ తల్లి కన్నీళ్లు పెడుతుందని తెలిపారు. ఉద్యమ తల్లిని నేడు కాంగ్రెస్ తల్లిగా మార్చారని విమర్శించారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని రహదారిలో ఏర్పాటు చేసి.. తెలంగాణ తల్లి అని చెబుతున్న విగ్రహాన్ని చెరసాలలో ఏర్పాటు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని వెల్లడించారు. కోట్లాది మంది తెలంగాణ బిడ్డల్లో స్ఫూర్తి నింపిన తెలంగాణ తల్లి రూపురేఖలను మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బతుకమ్మతో పువ్వులను పూజించే సంస్కృతి తెలంగాణలో తప్ప ప్రపంచంలో మరెక్కడా లేదని తెలిపారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేశారని మండిపడ్డారు. బతుకమ్మను మాయం చేయడం దురదృష్టకరమని చెప్పారు. బతుకును ఆగం చేశారని, బతుకమ్మను మాయం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లికి నివాళులు అర్పించాలి అనుకుంటే గన్ పార్క్ దగ్గర ముక్కు నెలకు రాయాలన్నారు. ఉద్యమకారులపై తుపాకీ ఎక్కు పెట్టినందుకు తెలంగాణ తల్లికి నివాళులర్పించే హక్కు సీఎం రేవంత్ రెడ్డికి లేదని చెప్పారు.

గ్రూప్-2 హాల్ టికెట్ల విడుదల

15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు

హైదరాబాద్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2024 గ్రూప్–2 హాల్ టిక్కెట్లు విడుదల అయ్యాయి. డిసెంబర్ 9 నుంచి కమిషన్ వెబ్‌సైట్‌లో హాల్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయి. గ్రూప్ –2 పరీక్షకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు తెలంగాన పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డును డౌన్ లోడ్ చేసుకోవచ్చు. 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్–2 పరీక్ష జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో గుర్తించిన 1368 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష జరగనుంది. గ్రూప్–2 సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ పరీక్ష ఉదయం సెషన్లో ఉదయం సెషన్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1, పేపర్–3, సాయంత్రం సెషన్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2, పేపర్–4 నిర్వహిస్తారు.గ్రూప్ 2 పరీక్షల ఉదయం సెషన్‌లో పరీక్షలు ఉదయం 08:30 గంటల నుంచి, మధ్యాహ్నం సెషన్ కోసం మధ్యాహ్నం 1:30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఉదయం సెషన్ కు ఉదయం 9:30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ కు మధ్యాహ్నం 2:30 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లను మూసివేస్తారు మరియు గేట్లు మూసివేసిన తర్వాత పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థిని అనుమతించరు. మొదటి సెషన్ పరీక్షకు ఉపయోగించిన డౌన్ లోడ్ చేసిన హాల్ టికెట్ కాపీని మిగిలిన సెషన్లకు ఉపయోగించేలా అభ్యర్థులు చూసుకోవాలి. తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు హాల్ టికెట్ భద్రపరుచుకోవాలి. అవసరమైనప్పుడు వాటిని ఉత్పత్తి చేయాలి. తరువాత డూప్లికేట్ హాల్ టికెట్ జారీ చేయరని కమిషన్ స్పష్టం చేసింది.

మూడ్రోజుల పాటు జైపూర్, ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

హైదరాబాద్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల పాటు జైపూర్, ఢిల్లీలో పర్యటించనున్నారు. డిసెంబర్ 11 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. మొదట వ్యక్తిగత పనుల నిమిత్తం రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్ళనున్నారు. ఆ తర్వాత రెండు రోజులు ఢిల్లీలో పర్యటిస్తారు. ఢిల్లీలో తెలంగాణకు సంబంధించిన అంశాలపై వివిధ శాఖల మంత్రులు, అధికారులతో చర్చిస్తారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతోనూ ఆయన సమావేశమవుతారు. కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై ఢిల్లీ పెద్దలతో చర్చించనున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16వ తేదీ వరకు వాయిదా పడ్డాయి ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు, ఇతర ముఖ్యనేతలు కూడా ముఖ్యమంత్రితో ఢిల్లీకి వెళ్లే అవకాశముంది.

హైవేపై రోడ్డు ప్రమాదం

డీలక్స్ బస్సును ఢీకొట్టిన లారీ

ప్రమాదంలో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి

చౌటుప్పల్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): హైదరాబాద్–విజయవాడ హైవేపై రోడ్డు ప్రమాదం జరిగింది. నల్గొండ నుంచి హైదరాబాద్ వెళు తున్న డీలక్స్ బస్సు.. ముందు వెళుతున్న ఓ లారీని ఢీకొట్టింది. దీంతో ప్రమాదం చోటు చేసుకుంది. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్ మృతదేహం క్యాబిన్‌లో ఇరుక్కుపోయింది. దీంతో క్రేన్ సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరికొందరిని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు.

అసెంబ్లీ 16 వరకు వాయిదా

హైదరాబాద్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16వ తేదీకి వాయిదా పడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై ప్రకటన చేశారు. ఈరోజు సాయంత్రం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సభలో వెల్లడించారు. ఈ విగ్రహావిష్కరణకు అందరూ రావాలంటూ సభాముఖంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు, సభ్యులు తమ తమ అభిప్రాయాలను తెలిపారు.

ఆశావర్కర్ల ఆందోళన ఉద్రిక్తం

18,000 ఫిక్స్‌డ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్

ఆశావర్కర్లపై చేయిచేసుకున్న పోలీసులు

దాడిని ఖండించిన హరీశ్‌రావు

మగ పోలీసులతో దౌర్జన్యామా?

సీఎం రేవంత్‌పై కేటీఆర్ నిప్పులు

హైదరాబాద్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): సీఎం రేవంత్ రెడ్డి ఆశావర్కర్లకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.18000 ఫిక్స్‌డ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కోఠి డీఎంఈ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అరెస్టు చేసేందు కు యత్నించారు. దీంతో ఆశా వర్కర్లకు పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసు జులుం నశించాలంటూ పెద్ద ఎత్తున ఆశావర్కర్లు నినాదాలు చేశారు. ఇక ఆశావర్కర్లకు మద్దతు నిలిచిన బీఆర్ఎస్ కార్యకర్తలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. కార్యాలయం వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లపై పోలీసులు చేయి చేసుకున్నారు. ఎగిరెగిరి ఓ ఆశా వర్కర్‌ను మహిళా పోలీసులు కొట్టారు. బాధిత ఆశా వర్కర్ ఆ దెబ్బలకు తాళలేక తల్లడిల్లిపోయిం ది. ఆమెను పోలీసులు అసభ్యకర పదజాలంతో దూషిం చారు. ద్దరు ఆశా వర్కర్లు సొమ్మసిల్లి పడిపోయారు. ఆ ఇద్దరిని పోలీసులు పట్టించుకోలేదు. చివరకు మిగతా ఆశా కార్యకర్తలు వారిద్దరిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సంతోష అనే ఆశా వర్కర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, వారికి వైద్యం అందిస్తున్నామని ఉ స్మానియా డాక్టర్లు పేర్కొన్నారు. ఉస్మానియాలో చికిత్స పొందుతున్న ఆశా వర్కర్లను బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌తో పాటు పలువురు పరామర్శించారు. ఆశా వర్కర్ల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను బీఆర్ఎస్ నేతలు ఆదేశించారు. ఏసీపీ, సీఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు.ఒకవైపు తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు చేస్తున్నమని గొప్పలు చెబుతూ, మరో వైపు క్షేత్రస్థాయిలో విశిష్ట సేవలందించే ఆశా తల్లులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్ల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని అభయహస్తం మేనిఫెస్టో పేజీ నెంబర్ 26లో హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ అమలు చేయాలంటూ ఆశా అక్కా చెల్లెళ్లు రోడ్డెక్కితే పోలీసులతో ఇష్టారీతిన కొట్టించడం దుర్మార్గం అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలకు సేవలందించే ఆశా వర్కర్లకు నిరసించే హక్కు లేదా? సమస్యలు పరిష్కరించాలని అడిగే స్వేచ్ఛ లేదా? తెలంగాణ ఏర్పాటుకు మందు ఆశాల గౌరవ వేతనం రూ. 1500 మాత్రమే ఉంటే, కేసీఆర్ రూ. 10 వేలకు పెంచి ప్రశ్నిస్తే పోలీసులతో పళ్లూడగొట్టించే దుర్మార్గ వైఖరిని అవలంబిస్తూ, ఆశాల ఆశలపై నీళ్లు చల్లుతుండటం సిగ్గుచేటు అని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఈ పరిణామాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. గ్రామ ప్రజలందరికీ మాతృమూర్తులుగా వ్యవహరిస్తున్న ఆశా వర్కర్లపై మగ పోలీసులతో దౌర్జన్యామా..? అని సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లులపై ఏమిటీ దుర్మార్గం..? అని రేవంత్‌పై కేటీఆర్ మండిపడ్డారు. ఆశా వర్కర్లు మీకు తల్లుల్లా కనిపించడం లేదా..? ఏం పాపం చేశారని నడిరోడ్డుపై లాగిపా రేస్తున్నారు..? దళిత, బహుజన ఆడబిడ్డలపై ఇంతటి అరాచకమా..? హోంమంత్రిగా ఉన్న మీకు ఆడవాళ్లంటే అంత చులకనా..? ఇందిరమ్మ రాజ్యమంటే అణచివేతలు, అక్రమ అరెస్టులేనా..? అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు.

తెలుగు తప్పనిసరేం కాదు

హైదరాబాద్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): 10 తరగతి మినహా మిగతా బోర్డులకు సంబంధించిన పాఠశాలల్లో తెలుగు సబ్జెక్టు తప్పనిసరిగా అమలు చేయాలనే నిబంధనను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఈ నిబంధనను కేవలం 8వ తరగతి వరకు మాత్రమే అమలు చేయాలని, 9, 10 తరగతులకు మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది.. తెలంగాణ రాష్ట్రంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ ఇతర బోర్డుల్లో 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు రాష్ట్ర సర్కార్ కీలక అప్‌డేట్ జారీ చేసింది. ప్రస్తుత (2024–25), వచ్చే విద్యా సంవత్సరం (2025–26) తొమ్మిదవ, పదో తరగతి చదివే విద్యార్థులు తెలుగును ఒక సబ్జెక్టుగా చదవడంపై మినహాయింపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో 2018–19 విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి వరకు పాఠశాల విద్యార్థులు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా చేస్తూ చట్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ చట్టం సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ ఇతర బోర్డుల్లో 1 నుంచి 8వ తరగతి వరకు మాత్రమే అమలు చేస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులు చదవడం లేదు. కేవలం ఐదు సబ్జెక్టులే చదువు తున్నారు. భాషా సబ్జెక్టుల్లో ఆంగ్లం, హిందీ మాత్రమే వీరంతా అభ్యసిస్తున్నారు. ఇతర బోర్డుల్లో తెలుగు మాతృభాష కానివారు కూడా అధిక సంఖ్యలో ఉండటమే ఇందుకు కారణం. దీంతో ఆ సబ్జెక్టులో తప్పనిసరిగా పాస్ కావాలంటే ఇబ్బందులు వస్తాయ ని భావించిన విద్యాశాఖ 2024–25, 2025–26 విద్యా సంవత్సరాలకు అమలును మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) 2025 ఫలితాలు విడుదలైన సంగతి తెలిసిందే. పరీక్ష రాసిన అభ్యర్థులు అప్లికేషన్ లేదా అడ్మిట్ కార్డు నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి స్కోరు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశ వ్యాప్తంగా 141 పరీక్ష కేంద్రాల్లో డిసెంబర్ 1వ తేదీన క్లాట్ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధిం చిన వివరాలు డిసెంబర్ 9న అందుబాటులో రానున్నాయి. ఇందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా నేషనల్ లా స్కూల్స్, యూనివర్సిటీల్లో యూజీ, పీజీ డిగ్రీ ప్రోగ్రాంలలో (ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం) ప్రవేశాలు కల్పిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 24 ప్రధాన లా యూనివర్సిటీలు ఇందులో పాల్గొంటున్నాయి. కాగా ఆలిండియా స్థాయిలో ఏటా కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సులు ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో చదివేందుకు అవకాశం ఉంటుంది.

గ్రూప్3 ఫలితాలు మరింత ఆలస్యం

అభ్యర్థులకు తప్పని సుదీర్ఘ నిరీక్షణ

హైదరాబాద్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్స్ పరీక్షల ఫలితాలు, పోస్టుల భర్తీ ప్రక్రియను అవరోహణ క్రమం నిర్వహించాలని టీజీపీఎస్సీ బోర్డు నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే తొలుత గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు అక్టోబరు 21 నుంచి 27 వరకూ జరిపారు. ఆ తర్వాత గ్రూప్–3 పరీక్షలు నవంబరు 17, 18 తేదీల్లో జరిగాయి. గ్రూప్ 2 పరీక్షలు డిసెంబర్ 15, 16 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షల మాదిరిగాకాకుండా ఫలితాలను మాత్రం రివర్స్ విధానంలో విడుదల చేసేందుకు కమిషన్ సిద్ధం అవుతుంది. అంటే తొలుత గ్రూప్ 1 ఫలితాలు విడుదల చేసి, అందులోని పోస్టులన్నీ భర్తీ చేశాక.. గ్రూప్ 2 ఫలితాలు విడుదల చేసి.. ఆ పోస్టులు కూడా పూర్తిగా భర్తీ చేపట్టాలని భావిస్తుంది. ఆ తర్వాతే గ్రూప్ 3 ఫలితాలు విడుదల చేయాలని నిర్ణయించింది. బ్యాక్‌లాక్‌లకు చెక్ పెట్టేందుకే ఈ విధానాన్ని అనుసరించనున్నట్లు టీజీపీఎస్సీ చెబుతుంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో రీలింక్విష్‌మెంట్ విధానం అమల్లో లేనందున, మెరిట్ ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు అవకాశాలు కోల్పోకూడదన్న ఉద్దేశంతో ఈ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతుంది. దీనిలో భాగంగానే ఉన్నత కేటగిరీ పోస్టుల తరువాత కింది కేటగిరీ పోస్టుల భర్తీ చేపట్టాలని. తద్వారా బ్యాక్‌లాగ్‌ను నివారించవచ్చని కమిషన్ భావిస్తోంది.ఇప్పటికే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమైంది. ఫిబ్రవరిలోగా వీటి ఫలితాలు ప్రకటించాలని, అనంతరం డ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తిచేసి, తుది ఫలితాలు ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. మార్చి నాటికి గ్రూప్ 1 నియామక ప్రక్రియ ముగించి, వెనువెంటనే గ్రూప్ 2 ఫలితాలు ప్రకటించాలని భావిస్తుంది. ఆ తర్వాతే గ్రూప్ 3 ఫలితాలు రానున్నాయి. గ్రూప్ 3లో 1388 పోస్టుల భర్తీ కోసం మూల్యాంకన ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. మొత్తంగా వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి గ్రూప్స్ 1, 2, 3 పోస్టుల నియామకాలన్నీ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు

పోలీసులను నిలదీసిన కేటీఆర్

పోలీస్‌స్టేషన్‌కు కేటీఆర్ తరలింపు

హైదరాబాద్, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): దీక్షా విజయ్ దివస్ సందర్భంగా సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, అదానీ ఫొటోతో కూడిన టీషర్టులను ధరించి అసెంబ్లీకి బయల్దేరారు. దీంతో అసెంబ్లీ గేటు–2 వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. రేవంత్, అదానీతో కూడిన టీషర్టు ధరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొన్నది. ఈ నేపథ్యంలో పోలీసుల అధికారులను కేటీఆర్ నిలదీశారు. తమను ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలన్నారు. రేవంత్ అదానీ భాయి భాయి అంటూ ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు నిరసన వ్యక్తం చేశారు. ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ, తెలంగాణ తల్లి మాది.. కాంగ్రెస్ తల్లి నీది, బతుకమ్మను తీసి చేయి గుర్తు పెట్టిందంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ క్రమంలో కేటీఆర్, హరీశ్ రావు, కవిత, సబితా ఇంద్రారెడ్డితోపాటు పార్టీ ప్రజాప్రతినిధులు అరెస్టు చేసి పోలీసు వ్యాసుల్లో అక్కడి నుంచి తరలించారు.

అదానీతో సీఎం రేవంత్‌రెడ్డి చీకటి ఒప్పందాలు

అక్రమాలను బయటపెడుతామనే అడ్డుకుంటున్నారు : హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): అదానీ దొంగ అని, అవినీతి చేసిండని రాహుల్ గాంధీ తిడితే, రేవంత్ రెడ్డి ఇక్కడ చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నాడని మాజీ

పవన్ కళ్యాణ్‌కు బెదిరింపులు

నేరుగా చంపేస్తామంటూ ఫోన్ కాల్స్
అప్రమత్తమైన పోలీసులు

అమరావతి, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడంతో, పోలీసులు అప్రమత్తమ య్యారు. ఏకంగా పవన్ కళ్యాణ్ ను చంపేస్తామంటూ అగంతకుడు ఫోన్ చేయగా, పోలీసుల దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఇటీవల పవన్ కళ్యాణ్ కాకినాడ పోర్టును సందర్శించారు. ఆ పర్యటనలో అక్రమ రేషన్ దందాను వెలుగులోకి తెచ్చారు పవన్. కాకినాడ పోర్టుకు పర్యటన ఖరారు కాగానే, అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు స్వయంగా పవన్ కళ్యాణ్ ప్రకటించారు. అప్పటివరకు కాకినాడ పోర్టు వ్యవహారం అంతగా వెలుగులోకి రానప్పటికీ, పవన్ పర్యటనతో కేంద్రం సైతం పోర్టుపై ప్రత్యేక నిఘా ఉంచింది. కాకినాడ పోర్టు వ్యవహారం పలు మలుపులు తిరుగుతూ, నిరంతరం వార్తల్లో నిలుస్తోంది. మొత్తం మీద కాకినాడ పోర్టు కేంద్రంగా సాగుతున్న అక్రమ దందాను పవన్ కళ్యాణ్ వెలుగులోకి తీసుకురావడంతో సంచలనంగా మారింది. తాజాగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ వచ్చినట్లు తెలుస్తోంది. ఏకంగా పవన్ కళ్యాణ్ ను చంపేస్తామని హెచ్చరిస్తూ అగంతకుడు ఫోన్ చేసినట్లు సమాచారం. అలాగే అసభ్య పదజాలంతో మెసేజ్ లు కూడా రావడంతో, డిప్యూటీ సీఎం పేషీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ విషయాన్ని ముందుగా పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లిన అధికారులు, అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఈ బెదిరింపులకు పాల్పడింది ఎవరు? బెదిరింపుల వెనుక కాకినాడ పోర్టు వ్యవహారం ఉందా? లేక ఆకతాయి పనా? అనేది పోలీసులు దర్యాప్తులో తేలాల్సి ఉంది. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ కు భద్రత మరింత పటిష్టం చేయాలని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

మళ్లీ రాజ్యసభకు ఆర్.కృష్ణయ్య

రాజ్యసభకు నామినేటెడ్ చేసిన బీజేపీ పార్టీ

హైదరాబాద్, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): బీసీ ఉద్యమ నాయకుడు ఆర్ కృష్ణయ్యకు మళ్లీ రాజ్యసభ పదవి వరించింది. భారతీయ జనతా పార్టీ ఆర్ కృష్ణయ్యను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రాజ్యసభకు నామినేట్ చేసింది. ఈ క్రమంలో ఆర్ కృష్ణయ్య మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మళ్లీ రాజ్యసభ పదవి వరించడంతో ఆర్ కృష్ణయ్యకు బీసీ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వైసీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కృష్ణయ్య తన పదవీకాలం మరో నాలుగేండ్లపాటు ఉండగానే తన పదవికి ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఇక 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్బీ నగర్ నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసి గెలుపొందారు. అనేక బీసీ ఉద్యమాలకు నాయకత్వం వహించారు. బీసీల రిజర్వేషన్లు, వారి అభివృద్ధి కోసం అనేక పోరాటాలు నిర్వహించారు.

విశాఖ డెయిరీపై ఆడిట్ జరగాల్సిందే

శాఖ డెయిరీని పరిశీలించిన ప్రత్యేక హౌస్ కమిటీ

విశాఖ, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): విశాఖ డెయిరీలో అవకతవకలపై ఏర్పాటైన అసెంబ్లీ సభా సంఘం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. సభా సంఘం చైర్మన్ జ్యోతుల నెహ్రూ అధ్వర్యంలో, సభ్యులు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, గౌతు శిరీష, ఆర్ వి ఎస్ కె రంగారావు, దాట్ల సుబ్బరాజు, బొండా ఉమామహేశ్వరరావు ఈ ఉదయం విశాఖ చేరుకున్నారు. బస చేసిన హోటల్ నుంచి అందరూ విశాఖ డెయిరీ చేరుకున్నారు. అధికారులతో కలిసి విశాఖ డెయిరీని ప్రత్యక్షంగా పరిశీలించారు. సుమారు ముడు గంటలు డైయిరీ పై సమీక్ష నిర్వహించారు. అలాగే జిల్లా అధికారులతో సభ సంఘం సమీక్ష నిర్వహించింది.విశాఖ డెయిరీ పరిశీలించిన అనంతరం సభా సంఘం చైర్మన్ జ్యోతులు నెహ్రూ మీడియాతో మాట్లాడారు. స్పీకర్ ఆదేశాలతోనే విశాఖ డెయిరీ పరిశీలించామన్నారు. పరిశీలన తరవాత మా సందేహాలు మరింత పెరిగాయన్నారు. వీటి మీద ఒక నిపుణుల కమిటీ వేయాలని తెలిపారు. అలాగే విశాఖ డెయిరీ మీద ఆడిట్ జరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. తమ పరిశీలన సమయంలో విశాఖ డెయిరీ చైర్మన్ హాజరు కాలేదని, కేవలం ఎండీ మాత్రమే పాల్గొన్నారని వెల్లడించారు. విశాఖ డెయిరీ నాలుగు జిల్లాలో పరిధిలో ఉంది కనుక నాలుగు జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామన్నారు. పాడి రైతులకు నష్టం జరగకుండా నిర్ణయం తీసుకుంటామని వివరించారు. కమిటీ నివేదికను అసెంబ్లీకి అందిస్తామని జ్యోతుల నెహ్రూ తెలిపారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్పీకర్ ఆదేశాలతో విశాఖ డెయిరీ పై హౌస్ కమిటీ వేశారన్నారు. ఇప్పటిదాక విశాఖ డైరీ మీద అనేక అనుమానాలు సందేహాలు ఉన్నాయని, కానీ ఇక్కడకు వచ్చాక ఆ సందేహాలు మరింత పెరిగాయని వెల్లడించారు. పాడి రైతులను అడిగితే డబ్బులు తగ్గించారని చెబుతున్నారు, యాజమాన్యం మాత్రం అదేమీ లేదని చెప్తోందని తెలిపారు.

శ్రీశైలం వద్ద యువతి ఆత్మహత్యాయత్నం

శ్రీశైలం, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): శ్రీశైలం శిఖరేశ్వరం వద్ద ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికంగా ఉన్న గోడపై నుంచి ఓ యువతి నిన్న అడవిలోకి దూకింది. రాత్రంతా శిఖరేశ్వరం అడవిలోనే యువతి గడిపింది. సమాచారం అందుకున్న శ్రీశైలం పోలీసులు నిన్న రాత్రి నుంచి ఉదయం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం శిఖరేశ్వరం అడవిలో యువతిని పోలీసులు గుర్తించారు. అడవి నుంచి యువతిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. బాధిత యువతిని తెనాలి మండలం కొలకలూరుకు చెందిన వెన్నెలగా గుర్తించారు. అనంతరం వెన్నెల తల్లిదండ్రులకు శ్రీశైలం పోలీసులు సమాచారం అందించారు. యువతి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

వైసీపీ హయాంలో ఉపాధ్యాయులు,

చిన్నారులపై మోయలేని భారం

ఇచ్చిన హామీలు ఎగ్గొట్టి ప్రజా రక్షకుడిగా జగన్ ఫోజు : మంత్రి అనగాని

అమరావతి, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): వైసీపీ హయాంలో విద్యార్థులు, ఉపాధ్యాయులపై మోయలేని భారాన్ని పెట్టి విద్యా వ్యవస్థను నాశనం చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. జగన్ కన్నా మహానటుడు ఎవరున్నారుని ప్రశ్నించారు. పదే పదే అబద్దాలు చెప్పడంతోపాటు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి కూడా ప్రజా రక్షకుడిగా ఫోజు పెట్టడం జగన్ లాగా ఎవరికైనా సాధ్యమవుతుందా అని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు హత్యలు, దాడులు, అక్రమ కేసులతో అరాచకపాలన సాగించి ఇప్పుడేమో ఏమీ జరగక్కున్నా మొసలి కన్నీరు కార్చడం ఆయనకు మాత్రమే సరిపోతుందని ఎద్దేవా చేశారు. విద్యా వ్యవస్థను దారిలో పెట్టి రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు చంద్రబాబు చేస్తున్న శ్రమను జగన్ నటన అంటుంటే ప్రజలంతా ఆయనను ఛీదరించుకుంటున్నారని అన్నారు. ఆయన చేతకాని తనం వల్లే పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతాలు ఘోరంగా పడిపోయాయని చెప్పారు. గాడితప్పిన విద్యా వ్యవస్థను యువ నేత నారా లోకేష్ అహర్నిషలు కష్టపడి దారిలో పెడుతుంటే చూసి సహించలేక పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా నటించడం మానేసి కూటమి ప్రభుత్వం మాదిరిగా ప్రజల సంక్షేమం కోసం పాటుపడటం జగన్ రెడ్డి నేర్చుకోవాలని అన్నారు. లేకుంటే ఇప్పటికి లెవెన్ రెడ్డిగా ఉన్న పెద్ద జీరో రెడ్డిగా మారిపోతావు...తస్మాస్ జాగ్రత అని హెచ్చరించారు.

చంద్రబాబుకు బొత్స ధన్యవాదాలు

అమరావతి, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ నేతలు ఎన్నో మాటల తూటాలు పేలారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను కూడా ఎన్నో సార్లు తప్పుబట్టారు. వైసీపీ పాలనే బెటర్ అంటూ పోకడలకు పోయారు కూడా. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను ఉద్దేశిస్తూ ఎమ్మెల్సీ బొత్స సత్యానారాయణ పలు వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. వైసీపీ హయాంలో నాడు– నేడు కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో కనిపించాయంటూ కామెంట్స్ చేశారు. బొత్స ఇంకా మాట్లాడుతూ.. విశాఖలో డ్రగ్స్ వ్యవహారంపై తాను మళ్ళీ కేంద్రానికి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. "డ్రగ్స్‌కు సంబంధించి మాపై విష ప్రచారం చేశారు.. ఎన్నికల్లో లబ్ధి పొందారు" అంటూ విరుచుకుపడ్డారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులు పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించామని తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని పార్టీ నిర్ణయించిందన్నారు.

వర్మపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దు

వర్మకు మరోసారి ఊరటను కల్పించిన హైకోర్టు

అమరావతి, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): ప్రముఖ సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ఏపీ హైకోర్టు మరోసారి ఊరటను కల్పించింది. వర్మపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను పొడిగించింది. రానున్న శుక్రవారం వరకు గత ఆదేశాలను పొడిగించింది. మరోవైపు వర్మ ముందస్తు బెయిల్ పిటిషన్ పై హైకోర్టు రేపు విచారణ జరపనుంది. పోలీసులు తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించే అవకాశం ఉందనే ఆందోళనను వర్మ తన పిటిషన్ లో పేర్కొన్నారు.

టీడీపీలో యనమల లేఖ కలకలం

కాకినాడ సెజ్ లక్ష్యంగా విమర్శనాస్త్రాలు
కేవీరావు చౌదరిపై విమర్శలు చేస్తూ లేఖ
వైసీపీని కూడా వదలని రామకృష్ణుడు

అమరావతి, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు లేఖాస్త్రం సంధించారు. ప్రస్తుతం ఈ లేఖ టీడీపీలో కలకలం సృష్టిస్తోంది. కాకినాడ సెజ్ లక్ష్యంగా ఆయన లేఖ ఉంది. టీడీపీ అధినేత చంద్రబాబుకు సన్నితంగా ఉన్న కేవీ రావు చౌదరిపై విమర్శలు చేస్తూ.. లేఖలో అనేక అంశాలు పేర్కొన్నారు. ఈ లేఖపై టీడీపీ అధికారికంగా స్పందించలేదు. కాకినాడ సెజ్ పెద్ద షాట్లు (కంపెనీలు) ప్రయోజనాలను పొందాయి. బీసీ, చిన్న రైతులు, మత్స్యకారుల నుండి తక్కువ ధరలకు కొనుగోలు చేయడం లేదా భూసేకరణ చేయడం దీనికి కారణమని విమర్శించారు. కాకినాడ ఓడరేవు సొంత చేసుకున్న కేవీ రావు చౌదరికి చెందిన బడా కంపెనీలు.. కాకినాడ సెజ్‌లో భూమిని తక్కువ ధరలకు పొందాయి. ఆ భూమిని జీఎంఆర్ (వైశ్యా)కి కె.వి రావు చౌదరి వందల కోట్లకు అమ్మారు. ఆ తరువాత అరబిందో (జగన్మోహన్ రెడ్డి బినామీ)కి దాదాపు రూ.4,000 కోట్లకు కొనుగోలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం క్లెయిమ్ చేసిన భూమిని దివీస్ (మురళీ చౌదరి)తో సహా పరిశ్రమలను స్థాపించడానికి రూ.500 కోట్లు ఇచ్చారు. కోన అటవీ వాసులకు అనుకూలంగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించకుంటే, వారి వాస్తవ సమస్యల కోసం నిరంతరం పోరాడుతామని, వారి జీవనోపాధిని కాపాడేందుకు వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని యనమల కోరారు. చెన్నైలోని ఎన్‌జీటీ, సీఎంఎస్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఏపీ పొల్యూషన్ బోర్డుకు లేఖలు రాశాను. ఇవి చర్య తీసుకోవడానికి స్వతంత్ర సంస్థలుగా పరిగణించబడతాయి. కానీ వాస్తవానికి రాజకీయ నియంత్రణలో ఉంటాయి. పరిష్కరిస్తారా? లేదా? అనేది ప్రభుత్వాల ముందు ఉంది.ప్రభుత్వం తమకు అనుకూలంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. కాకినాడ సెజ్‌లోని కొన్ని భూములను మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వంటి స్థానిక వైసీపీ నాయకులు బలవంతంగా తీసుకున్నారు. ఆ భూములను డి-నోటిఫికేషన్ చేసిన తర్వాత భూ సేకరణ అసలు భూ యజమానులకే దక్కాలి. కానీ వైసీపీ ప్రభుత్వంలో అది జరగలేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తమ నాయకులకు అనుకూలంగా మొత్తం ఫ్రీడ్ చేసారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధం. అలాగే ఇది భూసేకరణ చట్టం స్ఫూర్తికి విరుద్ధం. దీనిపై విచారణ అవసరం. సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వం ఆ భూములను అసలు రైతులకు ఇవ్వాలి. కాకినాడ సెజ్ భూములను అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి. అలాంటి భూములను అసలు భూ యజమానులకు అప్పగించాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో న్యాయం కోసం ఆందోళనలు ఉద్ధృతం చేస్తాం. స్థానికులను రక్షించేందుకు మీడియా ముందుకు వస్తామన్నారు. ఎలాంటి తీవ్ర ఆందోళనలు జరగకుండా ఉండేందుకు ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు, ఎన్‌జీటీ ప్రతినిధి, రాష్ట్ర, జిల్లా అధికారులతో అధికారిక కమిటీని ఏర్పాటు చేసి, స్థానిక సమస్యలను పరిష్కరించడానికి వారు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. లేదంటే ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు,. కేవీ రావు కూడా కాకినాడ సెజ్‌లో నష్టపోయిన వారికి న్యాయం చేయలేదు. వంద కోట్ల నుంచి వెయ్యి కోట్ల వరకు ఆయన (కేవీ రావు) ఆర్జించి, బాధితులకు కొద్ది మొత్తమే ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ధనికులు (ప్లూటోక్రాట్లు) లాభపడుతుండగా, బలహీన వర్గాలు (పేదలు) సంపద సృష్టిలో, రాజకీయాల్లో పాల్గొనడంలో, అభివృద్ధి ముసుగులో నష్టపోతున్నారు. బిగ్ షాట్‌ల బారి నుండి బీసీ రైతులు, మత్స్యకారులను రక్షించండి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం ఉంటుంది. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని అభ్యర్థించారు. ఈ సుదీర్ఘ లేఖపై అధికార టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి ఎటువంటి స్పందన రాలేదు. కాకపోతే ఆయా పార్టీల్లో ఈ లేఖపై చర్చోపర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ఈ లేఖలో చంద్రబాబు సన్నిహితుడిపై చేసిన ఆరోపణలతో పాటు వైసీపీ నేతలపై కూడా బలమైన ఆరోపణలు చేశారు. కానీ వైసీపీ కూడా ఈ లేఖపై స్పందించలేదు.

నంద్యాలలో
దారుణ ఘటన

ప్రేమించలేదని బాలికపై ఆక్రోశం
పెట్రోల్ పోసి తగులబెట్టిన యువకుడు

నంద్యాల,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): నంద్యాల జిల్లా నందికొట్కూరులో దారుణం చోటుచేసుకుంది. మరో ప్రేమోన్మాది చర్యకుఎ యువతి బలయ్యింది. ప్రేమించలేదనే కారణంతో బాలికపై యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాలిక మృతిచెందింది. యువకుడికి మంటలు అంటుకోవడంతో గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలం సామర్లకోటకు చెందిన బాలికను కలుగొట్లకు చెందిన యువకుడు రాఘవేంద్ర (21) కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు ఆమెను నందికొట్కూరులోని అమ్మమ్మ ఇంటికి పంపారు. ఆరు నెలల క్రితం యువకుడు అక్కడికి వచ్చాడు. దీంతో ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు చేరవేశారు. బాలిక స్నేహితులు ఎవరు వచ్చినా ఇంటికి రానివ్వొద్దని వారు సూచించారు. డోర్ తెరవడంతో లోపలికి వెళ్లి గడియపెట్టాడు. ఆ తర్వాత కాసేపటికి బాలి కపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు పెడుతూ అక్కడికక్కడే మృతిచెందింది. యువకుడికీ మంటలు అంటు కోవడంతో గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయాలతో ఉండటంతో రాఘవేంద్రను 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయసాయిరెడ్డి పద్ధతిగా మాట్లాడాలి

తప్పులు బయటపడుతున్నాయని ఇష్టానుసారం మాటలు
విజయసాయిరెడ్డిపై కేసులు నమోదు చేస్తాం
ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత

అమరావతి, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): చేసిన తప్పులు బయటపడుతున్నాయనే భయంతో వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. స్థాయి, వయసు మరిచిపోయి చిల్లరగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. చంద్రబాబును విమర్శించినా... తమకు, పవన్ కల్యాణ్ కు మధ్య చిచ్చు పెట్టాలని ప్రయత్నించినా విజయసాయిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పద్ధతిగా మాట్లాడాలని హితవు పలికారు. తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసుకోవాలని విజయసాయి ధైర్యంగా చెప్పాలని అనిత అన్నారు. ఆయనపై కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రేషన్ బియ్యం అక్రమాలపై కూడా విచారణ జరుగుతోందని... నిందితులను వదిలిపెట్టబోమని చెప్పారు. వైసీపీ నేతలు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా రావని అన్నారు. విజయవాడలోని సబ్ జైలును ఈరోజు అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జైల్లో పరిస్థితులను తెలుసుకోవడానికి వచ్చానని చెప్పారు. జైల్లో మౌలిక వసతులపై ఆరా తీయడం జరిగిందని తెలిపారు. జైలు అధికారులపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుగుతోందని, రెండు రోజుల్లో నివేదిక వస్తుందని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బియ్యం దోపిడీ ముఠా

ఆటకట్టించేందుకు సిట్

అందరి కళ్లుగప్పి విదేశాలకు బియ్యం తరలింపు
ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్

అమరావతి, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం నియమించిన " సిట్" పేదల బియ్యం దోపిడీ ముఠా ఆట కట్టిస్తుందని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. కాకినాడ పోర్టులో కూలీలకు పని కల్పించడం అంటే అక్రమ అవినీతి బియ్యం వ్యాపారంతో కాదు, సక్రమమైన ఎగుమతులు – దిగుమతుల వ్యాపారంతో అనే విషయాన్ని గుర్తు పెట్టుకొవాలని అన్నారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం పేదలకు ఆకలి తీర్చాలని రెట్టింపు బియ్యం ఇస్తే, కాకినాడ పోర్ట నుంచి రెట్టింపు బియ్యం విదేశాలకు వెళ్లిందని లెక్కలు చెబుతున్నాయన్నారు. పేదల బియ్యం దోపిడీ పైన "సిట్" అనగానే కలుగులో ఉన్న అవినీతిపరులు స్టాండ్, అటెన్షన్ అండ్ రన్ అనే పరిస్థితికి వచ్చారని చెప్పారు..ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బియ్యం ఎగుమతి చేస్తున్న నౌకను ఆపడం వెనక ఉన్న స్ఫూర్తి ముఖ్యమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం పేదలకు ఉచిత బియ్యం కోసం సంవత్సరానికి సగటున రూ.16 వేల కోట్లు వెచ్చిస్తున్న నిధులు దుర్వినియోగం కావడం బాధాకరమని తెలిపారు. ప్రస్తుతం దాదాపు రూ.10 వేల కోట్లు కేంద్రానికి, రూ.6 వేల కోట్లు రాష్ట్రానికి ఉచిత బియ్యం కోసం వ్యయం అవుతుందని అన్నారు. "గడచిన ఐదేళ్లలో మొత్తం రూ.80 వేల కోట్లు ఖర్చు అయితే కేంద్ర ప్రభుత్వం రూ.50 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు ఖర్చు అయ్యింది. 2019 – 24 మధ్య పేదలకు అందాల్సిన రూ.80 వేల కోట్ల ఉచిత బియ్యంలో సింహ భాగం అవినీతిపరులకు ఆదాయ మార్గంగా మారింది. పేదల ఆకలి తీర్చాల్సిన బియ్యం దోపిడీతో వారి కడుపు కొట్టి జేబులు నింపుకోవాలని చూస్తున్నారు. అర్హులైన పేదల ఆకలి తీరేవిధంగా బియ్యం పంపిణీలో సంస్కరణలు సూచించాల్సిన అవసరం ఉంది. పేదలకు పట్టెడు అన్నం పెట్టడానికి దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుగారు. 2/- కిలో బియ్యం పథకం ప్రారంభించారు. పేద ప్రజలకు ఉచిత బియ్యం పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గరీబ్ కల్యాణ్ అన్న యోజన ప్రారంభించారు. దీనికి అదనంగా జాతీయ ఆహార భద్రత చట్టం క్రింద ఇచ్చే బియ్యం అదనం. గత మూడు సంవత్సరాలుగా స్థిరమైన వాస్తవిక సమాచారంతోనే ప్రజలతో కలిసి ముందుకెళ్తున్నాం. 10 అక్టోబర్ 2024న సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారులను ప్రభుత్వ ఉచిత బియ్యం సమీక్ష కోసం సమాచారాన్ని అడగాం. బియ్యం దోపిడీ పైన సమాచార హక్కు చట్టం ద్వారా జూలై 2022లో మొదలైంది. 11 నవంబర్ 2022న లభించిన పూర్తి సమాచారంతో మొదటిసారి స్థానిక, జాతీయ మీడియా ద్వారా బియ్యం దోపిడీ పైన మేము వివరాలు ఇవ్వడం జరిగింది

ఎమ్మెల్సీగా బొర్రా గోపిమూర్తి విజయం

3,906 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపు

అమరావతి, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి ఘన విజయం సాధించారు. బొర్రా గోపిమూర్తి తన సమీప అభ్యర్థి గంధం నారాయణ రావుపై 3,906 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆయన మొదటి ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు. ఆయనకు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం నవంబర్ 4న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసింది. దీనికి సంబంధించిన పోలింగ్ డిసెంబర్ 5న జరిగింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో మొత్తం 116 పోలింగ్ కేంద్రాల్లో 16,737 ఓట్లకు గానూ, 15,494 (92.62 శాతం) ఓట్లు పోలైయ్యాయి.ఓట్ల లెక్కింపు ప్రక్రియ కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ)లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో జరిగింది. 14 టేబుల్స్‌పైన తొమ్మిది రౌండ్లలో ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తి చేశారు. 15,494 ఓట్లకు గాను ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి (9,165 ఓట్లు) తన సమీప అభ్యర్థి, ఎన్‌టీయూ బలపరిచిన గంధం నారాయణ రావు (5,259)పై 3,906 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇతర అభ్యర్థులు పులుగు దీపక్‌కు 102, నామన వెంకట లక్ష్మీకి 81, కావల నాగేశ్వరరావుకి 73 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో భారీగా చెల్లని ఓట్లు పడ్డాయి. చెల్లని ఓట్లు 814 పడ్డాయి. ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్న ఈ ఎన్నికల్లో చెల్లని ఓట్లు భారీగా పడటంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా సరిగా ఓట్లు వేయలేకపోతున్నారని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన షేక్‌సాబ్జీ కంటే, ఇప్పుడు గెలుపొందిన బొర్రా గోపిమూర్తి మెజార్టీ ఎక్కువగా నమోదు అయింది. ఆ ఎన్నికల్లో 17,467 ఓట్లకు 16,054 ఓట్లు పోలయ్యాయి. అందులో యూటీఎఫ్ తదితర సంఘాలు బలపరిచిన షేక్ సాబ్జీకి 7,987 ఓట్లు వచ్చాయి. ఆయన తన సమీప అభ్యర్థి, వైసీపీతో పాటు, పీఆర్‌టీయూ మద్దతిచ్చిన గంధం నారాయణరావు (6,453 ఓట్లు)పై 1,534 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పుడు టీడీపీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి చెరుకూరి సుభాష్ చంద్రబోసుకు 106 ఓట్లు, బీజేపీ మద్దతు ఇచ్చిన ఇళ్ల సత్యనారాయణకు 300 ఓట్లు వచ్చాయి. అప్పుడు 363 ఓట్లు చెల్లని నమోదు అయ్యాయి. ఈసారి ఓట్లు తగ్గినప్పటికీ మెజార్టీ పెరిగింది. మెజార్టీ 3,906 ఓట్లకు పెరిగింది. మరోవైపు రెండుసార్లు ఓటమి చెందిన గంధం నారాయణరావుకు పోలైన ఓట్ల సంఖ్య తగ్గింది. కాగా సంఘం నిర్ణయం మేరకు వాలంటీర్ రిటైర్మెంట్ తీసుకుని ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేశానని ఎమ్మెల్సీగా ఎన్నికైన గోపిమూర్తి తెలిపారు. సీపీఎస్ రద్దు కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందనన్నారు. అన్ని రంగాల్లో వలె విద్యారంగంలో ఉన్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, జెఎల్ ప్రమోషన్,అందరికీ హెల్త్ కార్డులు, ఐటీడీఏ పాఠశాలల్లో అప్ గ్రేడ

కెనడా, మెక్సికోకు ట్రంప్ చురకలు

రాయితీలు ఎందుకు ఇవ్వాలని దెప్పి పొడుపు

దాని బదులు అమెరికాలె చేరాలని సూచన

వాషింగ్టన్,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): అధికారం చేపట్టడానికి మరికొద్ది రోజుల ముందే ట్రంప్ తన మనోభావాలను, చర్యలను మెల్లగా బయటపెడుతున్నారు. కెనడా, మెక్సికోలు అమెరికాలో విలీనం కావడం మంచిదని సూచిస్తున్నారు. పొరుగు దేశాలు పొందుతున్న రాయితీలపై అమెరికాకు కాబోయే నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పైవిధంగా స్పందించారు. కెనడా, మెక్సికో దేశాలకు భారీఎత్తున రాయితీలు ఇవ్వడం కంటే ఆ రెండు అమెరికా రాష్ట్రాలతే సరిపోతుందని వ్యాఖ్యానించారు. ఈమేరకు ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. 'కెనడాకు ఏటా 100 బిలియన్ డాలర్లకు పైగా రాయితీలు కల్పిస్తున్నాం. ఇక, మెక్సికోకు 300 బిలియన్ డాలర్ల సబ్సిడీ ఇస్తున్నాం. ఎందుకు ఆ దేశాలకు మనం రాయితీలు ఇవ్వాలని ఆయన ప్రశ్నించారు. దానికంటే ఆ రెండు దేశాలు అమెరికాలో విలీనమైతేనే మంచిదని ట్రంప్ వ్యాఖ్యానించారు. అక్రమ వలసదారులను కట్టడి చేయకపోతే కెనడా, మెక్సికో దిగుమతులపై భారీ సుంకాలు విధిస్తానని కాబోయే అధ్యక్షుడు ఇదివరకే హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే ఇటీవల కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్లోరిడాకు వచ్చి ట్రంప్‌తో సమావేశమయ్యారు. ఆ సమయంలో టారిఫ్‌లు, సబ్సిడీల అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణా కట్టడి చేయడంలో విఫలమైతే కెనడా.. అమెరికా 51వ రాష్ట్రంగా చేరాలని ఆయన ట్రూడోకు చురకలు అంటించినట్లు వార్తలు వచ్చాయి. ఈసందర్భంగా అమెరికాలోకి వస్తున్న అక్రమ వలసదారుల గురించి ట్రంప్ స్పందించారు. అధికారం చేపట్టిన తొలిరోజు నుంచే పుట్టుకతో సంక్రమించే పౌరసత్వ అంశంపై దృష్టిసారిస్తానని చెప్పారు. జాతీయ అత్యయిక పరిస్థితి తరహాలో వచ్చే నాలుగేళ్లలో అక్రమ వలసదారులను దేశం దాటిస్తానని వ్యాఖ్యానించారు. 'డ్రీమర్ ఇమిగ్రెంట్స్' విషయంలో ఓ ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకొనే అంశాన్ని పరిశీలిస్తానన్నారు. ఇక, తాను అధికారంలోకి వచ్చిన తొలి రోజే క్యాపిటల్ భవనంపై దాడి కేసును ఎదుర్కొంటున్న 900 మందికి క్షమాభిక్ష పెడతానని ట్రంప్ సూచన ప్రాయంగా వెల్లడించారు. అంతకుముందు 2020లో జరిగిన ఎన్నికల్లో ట్రంప్ ఓటమి తర్వాత.. 2021 జనవరి 6న ఆయన మద్దతుదారులు క్యాపిటల్ భవనంపైకి దూసుకొచ్చి దాడి చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజా ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. వారికి క్షమాభిక్ష ప్రసాదించే అవకాశం ఉందని సమాధానమిచ్చారు.

రెండో జాబితాను విడుదల చేసిన ఆప్

న్యూఢిల్లీ, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే 11 మందితో తొలి జాబితాను రిలీజ్ చేసిన అధికార ఆప్.. తాజాగా 20 మంది అభ్యర్థులతో రెండో జాబితాను కూడా విడుదల చేసింది. ఇక ఈ లిస్ట్‌లో మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పేరు ఉంది. ఆయన ఈసారి పట్పర్‌గంజ్ అసెంబ్లీ స్థానం నుంచి కాకుండా.. జంగ్‌పురా నుంచి బరిలోకి దిగనున్నారు. ఇక ఇటీవలే ఆప్‌లో చేరిన ఉపాధ్యాయుడు అవధ్ ఓజాకు పట్పర్‌గంజ్ స్థానాన్ని కేటాయించారు. ఢిల్లీ అసెంబ్లీలో మొత్తం 70 స్థానాలు ఉన్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 70 స్థానాల్లో 62 స్థానాలను గెలుచుకున్న విషయం తెలిసిందే.

టంగ్‌స్టన్ మైనింగ్‌కు వ్యతిరేకంగా

తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

మధురై, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): తమిళనాడు రాష్ట్రంలోని మధురై నగరంలో టంగ్‌స్టన్ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. వాటర్ రిసోర్స్ మినిస్టర్ దురై మురుగన్ ఈ తీర్మానాన్ని అసెంబ్లీ ప్రవేశపెట్టారు. కేంద్ర సర్కారును ఈ తీర్మానం తీవ్రంగా విమర్శించింది. తమిళనాడు అభ్యంతరాలను లెక్కచేయకుండా కేంద్రం మధురైలో టంగ్‌స్టన్ మైనింగ్‌కు అనుమతులు ఇచ్చిందని మండిపడింది.అసెంబ్లీలో తీర్మానానికి ఆమోదం లభించడానికి ముందు దీనిపై తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. చివరకు ఆ తీర్మానానికి సభ ఆమోదం లభించింది. కేంద్ర ప్రభుత్వం మధురై నగరంలోని టంగ్‌స్టన్ గనులను తవ్వడానికి వేదాంత గ్రూప్‌కు అనుమతి ఇచ్చింది. దీనిపై అక్కడి ఆరిట్టపట్టి వాసులు ఆందోళనకు దిగారు. మైనింగ్‌ను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. దాంతో రాష్ట్ర సర్కారు మైనింగ్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.

ఇంట్లో పేలుడు ముగ్గురు మృతి

కోల్‌కతా,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): ఒక ఇంట్లో పేలుడు సంభవించింది.పేలుడు ధాటికి ఇంటి పైకప్పు కూలిపోయింది. ఈ సంఘటనలో ముగ్గురు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఆ ఇంట్లో బాంబులు తయారు చేస్తుండగా ఈ పేలుడు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం రాత్రి ఖయర్తాలా ప్రాంతంలోని ఒక ఇంట్లో దేశీయ బాంబులు పేలాయి. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు కూలిపోయింది. రాత్రి వేళ పేలుడు శబ్దం విని స్థానికులు భయాందోళన చెందారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ పేలుడులో ముగ్గురు మరణించగా పలువురు గాయపడినట్లు తెలిపారు. మృతులను మామున్ మొల్లా, సకీరుల్ సర్కార్, ముస్తాకిన్ షేక్‌గా గుర్తించినట్లు చెప్పారు. మామున్ మొల్లా ఇంట్లో దేశీయ బాంబులు తయారు చేస్తున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాంబులు పేలడంతో ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు భావిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐసిస్ శిబిరాలపై అమెరికా దాడులు

అధికారికంగా ప్రకటించిన అమెరికా

ఐసిస్ బలపడకుండా దాడి చేశామన్న బైడెన్

సిరియాలో అనూహ్య పరిణామాలు

పరిస్థితులను నిశితంగా గమనిస్తున్న భారత్

సిరియాలో అనూహ్యమైన పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. తిరుగుబాటు దళాలు రాజధాని డమాస్కస్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడంతో ఆ దేశ అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ కుటుంబాన్ని తీసుకొని రష్యాకు పారిపోయినట్టుగా కథనాలు వెలువడుతున్నాయి. దీంతో దశాబ్దాలుగా కొనసాగుతున్న అస్సాద్ పాలనకు ముగింపు పడింది. కాగా సిరియాలో అంతర్యుద్ధం పరిస్థితులను అదునుగా భావించిన అగ్రరాజ్యం అమెరికా ఉగ్రవాద సంస్థ ఐసిస్ స్థావరాలపై దాడులు మొదలు పెట్టింది. అస్సాద్ రష్యాకు పారిపోయిన కొన్ని గంటల వ్యవధిలోనే ఐసిస్ లక్ష్యాలపై ఆదివారం డజన్ల కొద్దీ దాడులు చేసింది. దేశంలో నెలకొన్న అంతర్యుద్ధ పరిస్థితులను అవకాశంగా మలచుకొని తిరిగి బలపడాలని ఐసిస్ చూస్తోందని, తాము అలా జరగనివ్వబోమని, 'స్పష్టమైన ఆలోచన'తో ఐసిస్ లక్ష్యాలపై దాడులు జరిపామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. ఈ మేరకు అధ్యక్ష భవనం నుంచి ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా ఐసిస్ స్థావరాలపై ఆదివారం దాడులు జరిపామని, తమ యుద్ధ విమానాలు డజన్ల కొద్దీ శిబిరాలను తాకాయని యూఎస్ మిలిటరీ నిర్ధారించింది. బీ-52, ఎఫ్-15, ఏ-10తో పాటు యూఎస్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన విమానాలను ఉపయోగించి సెంట్రల్ సిరియాలోని 75కు పైగా లక్ష్యాలపై దాడులు చేశామని అధికారిక ప్రకటనలో పేర్కొంది. కాగా సిరియాలో అధ్యక్షుడు అస్సాద్ పాలన పతనమవ్వడం న్యాయమేనని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించారు. దీర్ఘకాలంగా బాధపడుతున్న సిరియా ప్రజలకు ఇది చారిత్రాత్మక అవకాశమని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు బషర్ అల్ అస్సాద్, అతడి కుటుంబం రష్యా పారిపోయి అక్కడ ఆశ్రయం పొందినట్లు కథనాలు వెలువడుతున్నాయి. కాగా గత ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న అస్సాద్ కుటుంబ పాలనపై ఇస్లామిస్ట్ హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టీఎస్) అనే గ్రూపు మెరుపు దాడికి తెగబడింది. అమెరికా మద్దతున్న ఈ గ్రూపు దళాలు 11 రోజుల్లోనే సిరియాను తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. మరోవైపు పశ్చిమాసియాలో ఎప్పటి నుంచో సంక్షుభిత పరిస్థితులు ఉన్న దేశాల్లో సిరియా ఒకటి. తిరుగుబాటుదారులకు భయపడి దేశాధ్యక్షుడు బషర్ అల్ అసద్ దేశం విడిచి రష్యాకు పారిపోవడం సిరియాలో నెలకొన్న సంక్షోభానికి పరాకాష్ఠ. అంతర్జాతీయ సమాజం సిరియా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తోంది. తాజాగా, సిరియా అంశంపై భారత కేంద్ర ప్రభుత్వం స్పందించింది. సిరియాలో పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. సిరియాలో మళ్లీ స్థిరత్వం నెలకొనాలని కోరుకుంటున్నామని ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. సిరియా సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, ఐక్యతను పరిరక్షించు కునేందుకు అక్కడి అన్ని పార్టీలు కలసికట్టుగా పనిచేయాలని సూచించింది. అంతిమంగా సిరియా ప్రజల మనోభావాలకు అనుగుణంగా శాంతిస్థాపన జరగాలని, ఆ మేరకు రాజకీయ ప్రక్రియ ఉండాలని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఇక, సిరియాలో ఉన్న భారత పౌరుల భద్రత కోసం, రాజధాని డమాస్కస్ నగరంలోని భారత దౌత్య కార్యాలయాన్ని అన్ని వేళలా తెరిచి ఉంచుతున్నట్టు ఆ ప్రకటనలో వెల్లడించింది.

నీతా అంబానీకి.. సీఎన్‌బీసీ-టీవీ18 అవార్డు

ముంబై, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): రిలయన్స్ ఫౌండేషన్ వ్యస్థాపక చైర్‌పర్సన్ నీతా ముఖేశ్ అంబానీకి.. సీఎన్‌బీసీ-టీవీ18 అవార్డు దక్కింది. ఇండియా బిజినెస్ లీడర్ అవార్డులను శనివారం ముంబైలో అందజేశారు. ఔట్‌స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ టు బ్రాండ్ ఇండియా అవార్డును నీతా అంబానీ గెలుచుకున్నారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా ఆమె అవార్డును స్వీకరించారు. ఈ విషయాన్ని రిలయన్స్ ఇండస్ట్రీ సంస్థ తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది.నీతా అంబానీ ఓ విజినరీ వ్యక్తి అని, ఆమె దాతృత్వానికి ప్రతీక అని, కళాపోషకురాలు అని, లక్షలాది మందికి ఆమె దిక్సూచి లాంటి వ్యక్తి అని రిలయన్స్ సంస్థ తన ట్వీట్‌లో తెలిపింది. అన్ని అంశాల్లోనూ ఆమెకు నాయకత్వ లక్షణాలు ఉన్నట్లు చెప్పింది. అనేక పాత్రలను ఆమె ఈజీగా పోషించగలదని వెల్లడించింది. అణగారిన వర్గాలకు విద్యను అందించడం.. సామాజిక స్పృహ కలిగి ఉన్న వ్యక్తి అని రిలయన్స్ సంస్థ పేర్కొన్నది. భారతీయ కళలు, సంస్కృతికి ఆమె అనేక సేవలు చేశారు. నీతా ముఖేశ్ అంబానీ కల్చరల్ సెంటర్ ద్వారా ఆమె కళలకు ఓ ప్లాట్‌ఫాం క్రియేట్ చేసినట్లు అవార్డుల బృందం పేర్కొన్నది.

పార్లమెంటులో వాయిదాల పర్వం

మణిపూర్ హింసపై చర్చకు రాహుల్ పట్టు

న్యూఢిల్లీ,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): పార్లమెంట్ ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి దాదాపుగా ఇదే పరిస్థితి. అయితే సోమవారం ఉదయం 11.00 గంటలకు పార్లమెంట్ ఎప్పటిలాగా ప్రారంభమైంది. కానీ మణిపూర్‌లో అశాంతి, శంభులో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో వాటిపై చర్చ జరగాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అధ్యక్షతన విపక్షాలు పట్టుబట్టాయి. ఈ నేపథ్యంలో సభ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే వాయిదా పడింది. మధ్యాహ్నం 12.00 గంటల వరకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక ఈ శీతాకాల సమావేశాలు మరికొద్ది రోజుల్లో.. ముగియనున్నాయి. దీంతో ఈ సమావేశాల్లో ముఖ్యంగా మూడు కీలక బిల్లులు... రైల్వే (అమాండమెంట్) బిల్లు 2024, డిజాస్టర్ మేనేజ్‌మెంట్(అమాండమెంట్) బిల్లు 2024, బ్యాంకింగ్ లాస్ (అమాండమెంట్) బిల్లు 2024 బిల్లులను ఈ రోజు ఆమోదం పొందే అవకాశాలున్నట్లు తెలుస్తుంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు.. నవంబర్ 25వ తేదీన ప్రారంభమైనాయి. నాటి నుంచి నేటి వరకు మణిపూర్ లో అశాంతి, శంభులో హింసతోపాటు పలు సమస్యలపై సభలో చర్చించాలని ప్రతిపక్ష పార్టీలు పట్టుబడుతోన్నాయి. అందుకు సభలో సమయం కేటాయించకపోవడంతో.. ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నిరసనకు దిగాయి. ఈ నేపథ్యంలో సభ సజావుగా సాగడం లేదు. మరోవైపు విపక్షాల తీరును బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి తీవ్రంగా తప్పు పడుతోంది. ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు, ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగించేందుకు లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భగమయ్యారని బీజేపీ మండిపడ్డది.

దేశంలో బాంబు బెదిరింపుల కలకలం

న్యూఢిల్లీ, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): దేశంలో వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. ఇవాళ ఉదయం దేశ రాజధాని ఢిల్లీలోని ఏకంగా 44 పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మహారాష్ట్రలోని ఓ హోటల్‌కు ఈ తరహా బెదిరింపులే వచ్చాయి. నాగ్‌పూర్‌లోని గణేష్‌పేట్ కాలనీ ప్రాంతంలో గల హోటల్ ద్వారకామాయికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆగంతకులు ఈ మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. అప్రమత్తమైన హోటల్ యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో ఘటనాస్థలికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. అందులోని సిబ్బందిని బయటకు పంపించారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులూ, పేలుడు పదార్థాలూ లభించలేదని నాగ్‌పూర్ పోలీస్ డీసీపీ రాహుల్ మక్నికర్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. కాగా, సోమవారం ఉదయం ఢిల్లీలోని 44 పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులే వచ్చిన విషయం తెలిసిందే. ఆర్కే పురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పశ్చిమ్ విహార్‌లోని జీడీ గోయెంకా స్కూల్ సహా మొత్తం 44 పాఠశాలలకు ఈ మెయిల్స్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. ఆయా పాఠశాలల ఆవరణలో బాంబులు అమర్చినట్లు ఆగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. వాటిని పేల్చకుండా ఉండాలంటే 30 వేల డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సాయంతో ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులూ కనిపించలేదని పోలీసులు తెలిపారు. కాగా, ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఈ బెదిరింపులు వచ్చినట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహారాష్ట్ర స్పీకర్‌గా రాహుల్ నర్వేకర్

ముంబై, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా బీజేపీ ఎమ్మెల్యే రాహుల్ నర్వేకర్ ఎన్నికయ్యారు. వరుసగా రెండోసారి ఆయన ఆ పదవికి ఎన్నికయ్యారు. స్పీకర్ పదవి కోసం ఆయన ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీలు అజిత్ పవార్, ఏకనాథ్ షిండే, ఇతర బీజేపీ నేతలు ఆయనకు సపోర్టు ఇచ్చారు. స్పీకర్ పోస్టు కోసం మహా వికాశ్ అగాధీ కూటమి నామినేషన్ దరఖాస్తు చేయలేదు. ప్రతిపక్ష నేత ఎన్నిక అంశంలో స్పీకర్ నర్వేకర్ పాత్రపై అందరి దృష్టి ఉన్నది. అసెంబ్లీలో ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీకి 10 శాతం కన్నా తక్కువ సీట్లు ఉన్నాయి. దీంతో ప్రతిపక్ష నేత హోదాను ఇస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జూలై 2022లో తొలిసారి నర్వేకర్ స్పీకర్‌గా నియమితుడయ్యారు. శివసేన ఎమ్మెల్యేలు అనర్హత పిటీషన్లు దాఖలు చేసిన సమయంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తాజాగా ముగిసిన మహా అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి 288 సీట్లలో 230 సీట్లు దక్కాయి. మహా వికాశ్ అగాధికి 46 సీట్లు వచ్చాయి.

కొచ్చికి వెళ్తున్న విమానం... చెన్నైలో ల్యాండింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): 100 మంది ప్రయాణికులతో కేరళలోని కొచ్చి బయల్దేరిన ఓ ప్రైవేట్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని చెన్నైలో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ప్రయాణికులు, సిబ్బంది సహా మొత్తం 117 మందితో ఓ ప్రైవేట్ విమానం సోమవారం చెన్నై నుంచి కొచ్చి బయల్దేరింది. విమానం టేకాఫ్ అయిన కాసేపటికే సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో అప్రమత్తమైన పైలట్ ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని తిరిగి చెన్నైకి మళ్లించారు. అక్కడ సేఫ్‌గా ల్యాండ్ చేశారు. అందులోని ప్రయాణికులు, సిబ్బంది సేఫ్‌గానే ఉన్నట్లు అధికారులు తాజాగా వెల్లడించారు.

రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు..

న్యూఢిల్లీ, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): ఈ మధ్య కాలంలో రోడ్లపై పరుగులు పెడుతుండగానే వాహనాల్లో మంటలు చెలరేగుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. బస్సులు, కార్లు, బైకులు అన్న తేడా లేకుండా అన్ని రకాల వాహనాలు ఇలాంటి అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్నాయి. కొన్ని ఘటనల్లో భారీగా ప్రాణ నష్టం కూడా జరిగింది. మెజారిటీ ఘటనల్లో మాత్రం ప్రాణ నష్టం తప్పింది. తాజాగా అలాంటిదే మరో ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై రయ్యిమని దూసుకెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే కారును ఆపేసి బయటికి పరుగులు తీశాడు. ఆ తర్వాత మంటలు మరింత చెలరేగడంతో కారు పూర్తిగా కాలి బూడిదైంది. ఆ ప్రాంతంలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని జోగేశ్వరీ బ్రిడ్జిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

భారత అంతర్గత వ్యవహారాల్లో

విదేశీ సంస్థల ప్రమేయం

కశ్మీర్‌ను ప్రత్యతిరేఖ ఫౌండేషన్‌తో కాంగ్రెస్ కు సంబంధాలు

జార్జ్ సోరోస్‌తో సోనియా గాంధీకి సంబంధాలు

కాంగ్రెస్ పార్టీపై తీవ్ర ఆరోపణలు చేసిన బీజేపీ

న్యూఢిల్లీ,డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీలపై కేంద్రంలోని అధికార బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది. అమెరికాకు చెందిన జార్జ్ సోరోస్ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందిస్తున్న గ్రూపుతో సంబంధాలు ఉన్నాయని ఆరోపణాస్త్రాలు సంధించింది. భారత్ నుంచి కశ్మీర్‌ను వేరు చేయాలనే ఆలోచనలకు ఆ సంస్థ మద్దతిస్తోందని, సోరోస్ ఫౌండేషన్‌తో కాంగ్రెస్ సంబంధాలు పెట్టుకోవడం భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ సంస్థల ప్రభావాన్ని చూపుతోందని బీజేపీ అభివర్ణించింది. దేశాన్ని అస్థిర పరచాలనుకునే సంస్థలకు కాంగ్రెస్ మద్దతిస్తోందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా బీజేపీ ఆదివారం వరుసగా పోస్టులు పెట్టింది.ఎఫ్‌డీఎల్-ఏపీ ఫౌండేషన్‌కు (ఫోరమ్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్స్ ఇన్ ఆసియా పసిఫిక్) కో-ప్రెసిడెంట్‌గా ఉన్న సోనియా గాంధీ.. జార్జ్ సోరోస్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం పొందే సంస్థతో సంబంధాలు పెట్టుకున్నారని బీజేపీ ఆరోపించింది. కశ్మీర్‌ను ప్రత్యేకంగా పరిగణిస్తున్నట్లు ఎఫ్‌డీఎల్-ఏపీ ఫౌండేషన్ ఇదివరకే స్పష్టమైన అభిప్రాయాన్ని తెలిపిందని పేర్కొంది. రాజీవ్ గాంధీ ఫౌండేషన్‌కు సోనియా గాంధీ అధ్యక్షురాలిగా కొనసాగుతుండడంతో జార్జ్ సోరోస్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యానికి దారితీసిందని బీజేపీ పేర్కొంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేందుకు దేశంలో విపక్ష పార్టీతో సోరోస్ ఫౌండేషన్, మీడియా పోర్టల్ ఓసీసీఆర్‌ఫ్ జతకట్టాయని ఎంపీ నిషికాంత్ దూబే అన్నారు. ఈ అంశంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని తాను 10 ప్రశ్నలు అడుగుతానని నిషికాంత్ దూబే చెప్పారు. జార్జ్ సోరోస్ తనకు పాత స్నేహితుడని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ బహిరంగంగా అంగీకరించారని, ఇది గమనించాల్సిన విషయమని వ్యాఖ్యానించారు.

బ్లాక్ లీడర్‌ను ఏకాభ్రిపాయంతో

ఎన్నుకుంటాం : తేజస్వీయాదవ్

పాట్నా, డిసెంబర్9 (ఋషి ప్రతినిధి): ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' బ్లాక్ లీడర్‌ను ఏకాభిప్రాయం ద్వారా ఎన్నుకుంటామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీతో సహా కూటమికి చెందిన ఏ సీనియర్ నాయకుడైనా నాయకత్వం వహించడం పట్ల తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో 'ఇండియా' బ్లాక్ కూటమికి కాంగ్రెస్ నాయకత్వంపై పలు ప్రాంతీయ పార్టీలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. కూటమిని లీడ్ చేసేందుకు కొత్త సారథి కావాలని ఆశిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తేజస్వీ యాదవ్ మీడియాతో మాట్లాడారు. 'కూటమికి మమతా బెనర్జీ నాయకత్వం వహించడంలో మాకు ఎలాంటి సమస్య లేదు. కానీ బీజేపీ వ్యతిరేక కూటమిలో చాలా మంది సీనియర్ రాజకీయ నాయకులున్నారన్నది గుర్తించుకోవాలి. కూటమి నేతను ఎన్నుకోవడంపై కలిసి కూర్చుని సమిష్టి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే

అన్ని పార్టీల ఏకాభిప్రాయం ద్వారానే ఇది జరుగుతుంది' అని అన్నారు. మరోవైపు 'ఇండియా' కూటమికి నేతృత్వం వహించడంపై టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆసక్తి చూపారు. బెంగాల్ సీఎం పదవిని నిర్వహిస్తూనే 'ఇండియా' బ్లాక్ బాధ్యతలను కూడా చేపట్టగలనని అన్నారు. ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ కూడా దీనికి మద్దతిచ్చారు. మమతా బెనర్జీ సమర్థురాలని, 'ఇండియా' బ్లాక్‌కు నేతృత్వం వహించే హక్కు ఆమెకు ఉందని అన్నారు.

తగ్గిన పుష్ప-2 టికెట్ ధరలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ 'పుష్ప2: ది రూల్'. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం అని తేడా లేకుండా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ సునామీ సృష్టిస్తున్న విషయం తెలిసిందే. కేవలం 3 రోజుల్లో ఈ చిత్రం రూ.600 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా టికెట్ రేట్లకు సంబంధించి మూవీ ప్రేక్షకుల నుంచి నెగిటివ్ వచ్చిన విషయం తెలిసిందే. బెనిఫిట్ షో టికెట్‌నే రూ.1250గా పెట్టిన చిత్రబృందం విడుదలైన తర్వాత టికెట్ రేట్లను సింగిల్ స్క్రీన్‌లో రూ.350గా.. మల్టీప్లెక్స్‌లో రూ.550గా పెట్టింది. దీంతో సాధారణ ప్రేక్షకులు ఈ సినిమాకు చాలా దూరమయ్యారు. ముఖ్యంగా ఒక ఫ్యామిలీ నుంచి నలుగురు ఈ సినిమాకి వెళ్లాలి అంటే సింగిల్ స్క్రీన్‌లో రూ.1380 అవ్వనుండగా.. మల్టీప్లెక్స్‌లో రూ.2120లు కానుంది. దీంతో టికెట్ ధరలు మూవీపై చాలా ఎఫెక్ట్ పడ్డాయి. సోషల్ మీడియాలో అయితే టికెట్ ధరలపై సెటైర్లు , ట్రోలింగ్ ఓ రేంజ్‌లో జరిగింది. ఈ నేపథ్యంలో పుష్ప నిర్మాతలు దిగొచ్చారు. సోమవారం నుంచి ఈ సినిమా టికెట్ ధరలు తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. ఇక తగ్గిన ధరల బట్టి చూసుకుంటే.. సింగిల్ స్క్రీన్‌లో రూ.200 ఉండగా.. మల్టీప్లెక్స్‌లో రూ.350గా ఉంది. దీంతో అల్లు అర్జున్ అభిమానులు సంబరపడుతున్నారు. ఇప్పటి వరకు టికెట్ ధరలు చూసి భయపడ్డ ప్రేక్షకులు ఇకపై థియేటర్‌కు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పుష్ప-3లో విజయ్ దేవరకొండ హీరో?

సోషల్ మీడియా వచ్చాక జనాల్లో క్రియేటివిటీ పెరిగిపోయింది. వార్తలు వండటంలో ఒక్కొక్కరూ ఆరితేరిపోతున్నారనే చెప్పాలి. వాటిల్లో ఎక్కువ శాతం గాలివార్తలే ఉండటం చేత, నిజాలు చెప్పినా నమ్మే పరిస్థితి ప్రస్తుతం సమాజంలో లేదు. రీసెంట్‌గా ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నది. వివరాల్లోకెళ్తే.. 'పుష్ప 2' హిట్ అవ్వడంతో 'పుష్ప3' ప్రస్తుతం చర్చనీయాంశమైంది. 'పుష్ప2' ఎండింగ్‌లో 'పుష్ప 3-ర్యాంపేజ్' అంటూ మూడో పార్ట్‌ని దర్శకుడు సుకుమార్ ప్రకటించేశారు. దాంతో ఇప్పుడు 'పుష్ప 3' గురించి ఆసక్తికరమైన ఓ వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో హల్‌చల్ చేస్తున్నది. 'పుష్ప 3' విజయ్ దేవరకొండ కథానాయకుడిగా ఉంటుందనేది ఈ వార్త సారాంశం. బాంబ్ బ్లాస్టింగ్‌లో శ్రీవల్లి మిసహా పుష్పరాజ్ అండ్ ఫ్యామిలీ చనిపోతారట. శ్రీవల్లికి విజయ్ దేవరకొండ పుడతాడట. మూడో పార్టంతా దేవరకొండ చుట్టూనే తిరుగుతుందట. ఇందులో నిజం ఎంతుందో తెలీదుకానీ.. వార్త మాత్రం బలంగానే వినిపిస్తున్నది. వినడానికి కూడా గమ్మత్తుగా ఉంది. మరి ఇందులో నిజం ఆ సుకుమార్‌కే తెలియాలి.

అలాంటి ప్రేమ మరొకటి లేదు

వైరల్‌గా సమంత పోస్ట్

స్టార్ నటి సమంత తాజాగా తన పెంపుడు శునకం సాషాతో ఉన్న ఫొటోను ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకుంది. ఈ ఫొటోకు 'సాషా ప్రేమ లాంటి ప్రేమ మరొకటి లేదు' అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. స్టార్ నటి సమంతతో విడాకుల అనంతరం అక్కినేని నాగచైతన్య కొత్త బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. మరోనటి శోభిత ధూళిపాళ్లతో ఏడడుగులు వేశారు. వీరి వివాహం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. అయితే, వీరి వివాహం వేళ సమంత పెడుతున్న పోస్ట్‌లు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి. నాలుగు రోజుల క్రితం అమ్మాయి, అబ్బాయి కుస్తీ పోటీలకు సంబంధించిన వీడియో షేర్ చేసిన సమంత.. తాజాగా తన పెంపుడు శునకం సాషాతో ఉన్న ఫొటోను ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకుంది. ఈ ఫొటోకు 'సాషా ప్రేమ లాంటి ప్రేమ మరొకటి లేదు' అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. కాగా, సామ్ గత కొంతకాలంగా గడ్డుపరిస్థితుల్ని ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. నాగ చైతన్యతో విడాకుల అనంతరం కొద్దిరోజులకే మయోసైటిస్ బారిన పడింది. దాన్నుంచి కోలుకునేందుకు సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చింది. ఇప్పుడిప్పుడే.. మళ్లీ తిరిగి తన వర్క్‌లైఫ్‌లో బిజీగా మారుతుండగా ఇంతలో తన తండ్రి జోసెఫ్ ప్రభు హఠాత్తుగా మరణించారు. మరోవైపు మాజీ భర్త మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో తీవ్ర మనోవేదనలో ఉన్న సామ్‌కు నెటిజన్లు మద్దతుగా నిలుస్తున్నారు.



ట్రిపుల్ ఆర్‌పై డాక్యుమెంటరీ

దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ చిత్రం ఆర్ఆర్ఆర్. అగ్ర కథానాయకులు ఎన్టీఆర్, రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటించగా బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ కథానాయికగా నటించింది. డీవీవీ ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ చిత్రం ఈ సినిమా 2021లో విడుదలై బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా ఆస్కార్ అవార్డును గెలుచుకుంది. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి నేటికి 6 ఏండ్లు అవుతున్న సందర్భంగా.. చిత్రయూనిట్ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమాపై డాక్యుమెంటరీ రాబోతున్నట్లు ప్రకటించింది. ప్రపంచం మొత్తం ఈ సినిమా కీర్తిని చూసింది. ఇప్పుడు లోతులను చూస్తారు అంటూ పేరిటా డాక్యుమెంటరీ చిత్రంను అనౌన్స్ చేసింది. ఇక ఈ డాక్యును డిసెంబర్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ మూవీ డాక్యుమెంటరీ హక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

జానీ మాస్టర్‌కు బిగ్ షాక్

డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నుంచి తొలగింపు?

లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయ్యి బెయిల్ మీద బయటకు వచ్చిన ప్రముఖ టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు బిగ్ షాక్ తగిలింది. జానీను డ్యాన్సర్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నుంచి శాశ్వతంగా తొలగించినట్లు తెలుస్తుంది. తన మీద లైంగిక వేధింపుల ఆరోపణలు రానంతవరకు డ్యాన్సర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జానీ మాస్టర్ కొనసాగుతూ వచ్చాడు. ఎప్పుడైతే అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌ని లైంగికంగా వేధించాడనే ఆరోపణలు వచ్చాయో అప్పుడే ఆ పదవి నుంచి తోలగించాలని అసోసియేషన్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తాజాగా ఆదివారం అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించగా.. జోసెఫ్ ప్రకాశ్ విజయం సాధించారు. భారీ మెజారిటీతో విజయం సాధించిన ప్రకాష్ డ్యాన్సర్స్ అసోసియేషన్ కు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇది అయిదోసారి.

నా ఫిట్‌నెస్‌కు కారణం అదే..!

'గడిచిన జీవితం అంతా చదువు, ఆటలతోనే సరిపోయింది. నిజానికి నా లైఫ్‌లో సరదాలు తక్కువే. చిన్నప్పట్నుంచీ క్రమశిక్షణతోనే పెరిగాను. నాన్న సోల్జర్ కావడంతో ఇల్లంతా ఆర్మీ వాతావరణమే ఉండేది' అంటూ చెప్పుకొచ్చింది మీనాక్షి చౌదరి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత విషయాల గురించి ఆమె మాట్లాడింది. 'నాన్నకు ఆరోగ్యంపై శ్రద్ధ ఎక్కువ. అందుకే చిన్నప్పట్నుంచీ నన్ను స్పోర్ట్స్ వైపు నడిపించారు. నేను స్విమ్మింగ్, బ్యాడ్మింటన్‌లో స్టేట్ లెవల్ ప్లేయర్‌ని. నా ఫిజిక్ ఫిట్‌గా ఉండటానికి కారణం అదే. నాన్న ద్వారా అబ్బిన ప్రపంచజ్ఞానం నన్ను మిస్ ఇండియాగా నిలబెట్టింది. హీరోయిన్ అవుతానని మాత్రం అస్సలు అనుకోలేదు. ఓ విధంగా ఇదంతా మా నాన్న ఆశీర్వాదం' అంటూ ఆనందం వెలిబుచ్చింది మీనాక్షి చౌదరి. వెంకటేశ్‌కి జోడీగా ఆమె నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానున్న విషయం తెలిసిందే.

ది గర్ల్‌ఫ్రెండ్ టీజర్ రిలీజ్

యానిమల్, పుష్ప 2 ది రూల్ సినిమాలతో వరుస బ్లాక్ బస్టర్‌లు అందుకుంది నేషనల్ క్రష్ రష్మిక మందన్నా. అయితే ఈ సినిమాలు ఇచ్చిన జోష్‌తో ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ ప్రాజెక్ట్ చేస్తుంది ఈ భామ. రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. ఈ సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుండగా.. మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. నయనం నయనం కలిసే తరుణం.. ఎదనం పరుగై పెరిగే వేగం. నా కదిలే మనసుని అడిగా సాయం. ఇక మీదట నువ్వే దానికి గమ్యం అంటూ విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. స్టోరీ ఏం రివీల్ చేయకుండా టీజర్‌ను కట్ చేశారు మేకర్స్. ఇందులో రష్మిక బాయ్ ?ఫ్రెండ్‌గా దీక్షిత్ శెట్టి నటించబోతున్నాడు. గీత ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమాను అల్లు అరవింద్ నిర్మిస్తున్నాడు.

ఆ పాత్ర చేయడం అదృష్టం: రణ్‌బీర్

బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ' నితీశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి భారీ బడ్జెట్‌తో అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటిస్తుండగా.. సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ అపడేట్‌ను రణ్‌బీర్ పంచుకున్నారు. "రామాయణ ప్రాజెక్ట్‌లో వర్క్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇది ఎంతో గొప్ప కథ. చిన్నప్పటినుంచి వింటూ పెరిగాం. ఎంతోమంది ప్రతిభావంతులైన కళాకారులు ఇందులో వర్క్ చేస్తున్నారు. నితీశ్ తివారి అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. రెండు పార్టులుగా ఈ చిత్రం విడుదల కానుంది. పార్ట్1లో నా భాగం షూటింగ్ పూర్తి చేశాను. త్వరలోనే పార్ట్2 చిత్రీకరణ కూడా మొదలవుతుంది. ఇలాంటి పాత్రలో నటించడం నాకు కల. ఈ చిత్రంతో ఆ కల నిజమైంది. మన భారతీయ సంస్కృతి, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప సినిమా 'రామాయణ" అని అన్నారు. ఇటీవలే ఈ సినిమా గురించి నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. విడుదల తేదీలను తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. 2026 దీపావళికి మొదటి పార్ట్, 2027లో రెండో పార్ట్ విడుదల కానుంది. ఈ చిత్రం గురించి చాలా కాలంగా వార్తలు వస్తూనే ఉన్నాయి. ఫొటోలు షేర్ అవుతూనే ఉన్నాయి. సైలెంట్‌గా చిత్రీకరణను పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కష్టమేనా?

ధోని, కోహ్లీ చెత్త రికార్డు జాబితాలో రోహిత్

అడిలైడ్ ఓవల్ వేదికగా జరిగిన రెండో టెస్టు మ్యాచ్ లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ 10 వికెట్ల తేడాతో ఓడిపోయింది. దీంతో ఎంఎస్ ధోని, విరాట్ కోహ్లీల చెత్త రికార్డు జాబితాలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ చేరాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25లో భాగంగా పెర్త్ టెస్టులో 295 పరుగుల తేడాతో విజయం సాధించిన తర్వాత అడిలైడ్‌లో టీమిండియా బ్యాట్స్‌మెన్‌లు ధీమాగా ఉన్నట్లు కనిపించారు. మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంటుందనీ, రోహిత్ శర్మ పునరాగమనంతో జట్టు మంచి ప్రదర్శన కనబరుస్తుందని అందరూ భావించారు.. కానీ, అదేమీ జరగకుండా ఆస్ట్రేలియా చేతిలో భారత్ 10 వికెట్ల తేడాతో ఓడిపోయింది. రెండో టెస్టులో ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. ఈ ఓటమితో హిట్ మ్యాన్ రోహిత్ శర్మ పేరిట చెత్త రికార్డును నమోదుచేశాడు. భారత కెప్టెన్ల చెత్త రికార్డు జాబితాలో ఉన్న ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీలో రోహిత్ చేరాడు. అడిలైడ్ ఓవల్‌లో గులాబీ బంతితో ఆడిన మ్యాచ్‌లో భారత్ ఓటమి భారత కెప్టెన్‌గా రోహిత్‌కి వరుసగా నాలుగో టెస్టు ఓటమి. మూడు రోజులలో ఆస్ట్రేలియాతో జరిగిన పింక్-బాల్ టెస్ట్‌లో ఓడిపోవడానికి ముందు 2024 అక్టోబర్-నవంబర్‌లో న్యూజిలాండ్‌పై రోహిత్ కెప్టెన్సీలో భారత్ మూడు బ్యాక్-టు-బ్యాక్ టెస్టులను కోల్పోయింది. వరుసగా నాలుగు టెస్టు మ్యాచ్‌ల్లో ఓడిన ఆరో భారత కెప్టెన్‌గా రోహిత్ శర్మ చెత్త రికార్డు నమోదుచేశాడు.

రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో ఓటమిని చవిచూసింది. ఈ మ్యాచ్ తర్వాత ఐదు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమమైంది.బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్ జట్టుకు బిగ్ షాక్ తగిలింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో సూపర్ విక్టరీ అందుకున్న భారత జట్టు రెండో టెస్టులో మాత్రం ఢీలా పడింది. భారత్ జట్టు పై ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో అద్భుతమైన విజయంతో పునరాగమనం చేసింది. పింక్ బాల్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. పింగ్ బాల్ టెస్టు ఆడటం భారత్‌కు ఎప్పుడూ నష్టమే కలిగిస్తోంది. భారత జట్టు గత రెండున్నరేళ్లుగా పింగ్ బాల్ తో ఎలాంటి మ్యాచ్ లను ఆడలేదు. దీనికి తోడు భారత బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. భారీ అంచనాలున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్ లు రాణించలేకపోయారు. అలాగే, అనుకూల పరిస్థితుల్లో ఆస్ట్రేలియన్ బౌలర్లు భారత బలహీన బ్యాటింగ్ లైనప్‌పై చాలా బాగా రాణించారు. దీంతో కంగారుల చేతిలో భారత్ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. టీమిండియా ఈ మ్యాచ్‌లో ఓటమి తర్వాత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ సమీకరణాలు కూడా మారిపోయాయి. అడిలైడ్ ఓవల్ వేదికగా జరిగిన రెండో టెస్టు మ్యాచ్ లో ఆసీస్ చేతిలో భారత్ ఓడిపోయింది. ఈ ఓటమి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ స్థానంపై తీవ్ర ప్రభావం చూపింది. రెండుసార్లు ఫైనల్స్‌కు చేరిన భారత జట్టు ఇప్పుడు మూడో స్థానానికి పడిపోయింది. ఓటమి తర్వాత భారత్ పాయింట్ల శాతం (పీసీటీ) 57.29కి దిగజారడంతో ఇప్పుడు ఫైనల్ చేరే మార్గం కష్టంగా మారింది. మరోవైపు పెర్త్‌లో ఎదురుదెబ్బ తగిలిన ఆస్ట్రేలియా మళ్లీ పోటీలోకి దిగింది. ఇప్పుడు 60.71 పీసీటీతో పాయింట్ల పట్టికలో మొదటి స్థానానికి చేరుకుంది. ప్రస్తుత ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భారత్‌కు మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ మూడు మ్యాచ్‌లు టీమిండియా తప్పక గెలవాలి. ఇప్పుడు ఆస్ట్రేలియాలో భారత్ ఎలాంటి తప్పులు చేయకుండా మిగిలిన మూడు మ్యాచ్‌లను గెలిస్తే ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ పాయింట్ల పట్టికలో 64.03కి చేరుకుంటుంది. అయితే దీని తర్వాత కూడా ఫైనల్‌లో స్థానం కన్ఫర్మ్ కాదు. ఇదే సమయంలో శ్రీలంకపై అద్భుత ప్రదర్శన చేసి దక్షిణాఫ్రికా జట్టు రెండో స్థానంలోకి చేరింది. ఈ ఓటమితో భారత జట్టు 57.29 శాతం మార్కులతో మూడో స్థానానికి పడిపోయింది. 59.26 శాతం మార్కులతో దక్షిణాఫ్రికా రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా తన మిగిలిన ఐదు మ్యాచ్‌లలో మూడింటిని (భారత్‌పై మూడు, శ్రీలంకపై రెండు) గెలిస్తే అది ఫైనల్‌కు చేరుకుంటుంది. అదే సమయంలో, దక్షిణాఫ్రికా మొత్తం మూడు మ్యాచ్‌లను (శ్రీలంకపై ఒకటి, పాకిస్తాన్‌పై రెండు) గెలిస్తే దాని 69 కంటే ఎక్కువగా ఉంటుంది.

రోహిత్, షమి..గొడవ!

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ పేస్ బౌలర్ మహ్మద్ షమి మధ్య గొడవ జరిగినట్లు తాజాగా వార్తలు వస్తున్నాయి. న్యూజిలాండ్ తో జరిగిన తొలి టెస్టు సమయంలో బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడెమీలో ఉన్న షమిని రోహిత్ కలిశాడని, ఆ సమయంలో ఇద్దరూ మాటామాటా అనుకున్నట్లు ఆ రిపోర్టు తెలిపింది. రోహిత్ శర్మ, షమి మధ్య సంబంధాలు అంత బాగా లేవని దైనిక్ జాగరన్ రిపోర్టు ఒకటి వెల్లడించింది. న్యూజిలాండ్ తో బెంగళూరులో తొలి టెస్టు ప్రారంభానికి ముందు ఎన్సీఏలో ఉన్న షమిని రోహిత్ కలిశాడు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. షమి పూర్తి ఫిట్ గా లేడని, అతని మోకాలిలో వాపు ఉన్నట్లు చెప్పాడు. దీంతో షమికి కొత్త గాయం అయినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపై షమి అసంతృప్తి వ్యక్తం చేశాడు. బెంగళూరు టెస్టులో టీమిండియా ఓడిన తర్వాత మరోసారి షమిని రోహిత్ కలిసిన సందర్భంలో ఇద్దరి మధ్యా వాగ్వాదం జరిగినట్లు దైనిక్ జాగరన్ రిపోర్టు తెలిపింది. "షమి ఎన్సీఏలో ఉన్నప్పుడు రోహిత్ ను కలిశాడు. అయితే తన గాయం పరిస్థితి, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీస్ కు అందుబాటులో ఉండటంపై మీడియాకు రోహిత్ ఇచ్చిన సమాచారంపై అసంతృప్తిగా ఉన్న షమి అతనితో వాగ్వాదానికి దిగాడు" అని ఎన్సీఏ వర్గాలు వెల్లడించినట్లు ఆ రిపోర్టు తెలిపింది. ఇక తాజాగా ఆస్ట్రేలియా చేతుల్లో రెండో టెస్టులో పది వికెట్లతో ఓడిన తర్వాత కూడా మరోసారి షమిపై రోహిత్ శర్మ స్పందించాడు. "అతని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. ఎందుకంటే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఆడే సమయంలో షమి మోకాలిలో వాపు కనిపించింది. దీంతో అతడు టెస్టు మ్యాచ్ సంసిద్ధతకు దెబ్బ తగిలింది. మేము చాలా జాగ్రత్తగా ఉండాలనుకుంటున్నాం.అతన్ని తొందరపడి ఇక్కడికి తీసుకురావాలని అనుకోవడం లేదు. చాలా కాలం కావడంతో అతని విషయంలో 100 శాతం కంటే ఎక్కువ కచ్చితత్వం కోసం చూస్తున్నాం. అతనిపై ఒత్తిడి పెంచాలని భావించడం లేదు. కొందరు ప్రొఫెషనల్స్ అతని పరిస్థితిని గమనిస్తున్నారు. ప్రతి మ్యాచ్ చూస్తున్నారు. అతనికి ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంటాయి" అని రోహిత్ స్పష్టం చేశాడు. మహ్మద్ షమి తిరిగి వచ్చేది ఎప్పుడన్నదానిపై స్పష్టత లేదు. అతడు ఆస్ట్రేలియాకు వెళ్లడానికి అంతా సిద్ధంగా ఉన్నా ఇప్పటికీ బెంగాల్ తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బెంగాల్ తరఫున ఆడుతూనే ఉన్నాడు. నేషనల్ క్రికెట్ అకాడెమీ నుంచి పూర్తి క్లియరెన్స్ లభించిన తర్వాతే షమికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని బీసీసీఐ భావిస్తోంది.

భారత్‌కు డబ్ల్యూటీసీ ఫైనల్

అవకాశాలు సంక్లిష్టం

మూడో స్థానానికి పడిపోయిన టీమిండియా

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ ఓవల్ వేదికగా జరిగిన రెండో టెస్టులో భారత జట్టు ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. టీమిండియాను ఆతిథ్య ఆస్ట్రేలియా ఏకంగా పది వికెట్ల తేడాతో ఓడించి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది.

ఇక ఈ ఓటమితో ఐసీసీ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కి వెళ్లేందుకు భారత జట్టు సమీకరణాలు మరింత సంక్లిష్టంగా మారాయి. ప్రస్తుతం భారత్ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి పడిపోయింది. ఆసీస్ మూడో స్థానం నుంచి మొదటి స్థానానికి ఎగబాకింది. కాగా, ఈ బీజీటీ సిరీస్‌లోని మిగతా మూడు మ్యాచుల్లో ఒక్క మ్యాచ్ ఓడినా టీమిండియా ఫైనల్ బెర్త్‌కి దారి దాదాపు మూసుకుపోయినట్లే. సో.. భారత్ ఫైనల్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఓటమి లేకుండా ఈ సిరీస్‌ను ముగించాల్సి ఉంటుంది. ఇక ఈ మూడు మ్యాచుల్లో టీమిండియా విజయం సాధిస్తే.. ఇతర జట్ల సమీకరణాలపై ఆధారపడకుండా నేరుగా ఫైనల్‌కి దూసుకెళ్తుంది. ఒకవేళ రెండు మ్యాచులు గెలిచి, ఒకటి డ్రా అయినా కూడా భారత్ ఫైనల్‌కి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. కానీ, ప్రస్తుతం దక్షిణాఫ్రికా, శ్రీలంక మధ్య జరుగుతున్న రెండో టెస్టు ఫలితంపై ఇది ఆధారపడి ఉంటుంది. ఈ మ్యాచ్‌లో శ్రీలంకను సౌతాఫ్రికా ఓడించాల్సి ఉంటుంది. ఒకవేళ భారత్ బీజీటీలో ఒక్క మ్యాచ్ ఓడినా.. ఫైనల్ బెర్త్ కోసం దక్షిణాఫ్రికా వర్సెస్ శ్రీలంక, ఆస్ట్రేలియా వర్సెస్ శ్రీలంక సిరీస్‌ల సమీకరణాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అందుకే పింక్‌బాల్ టెస్టులో ఓటమి తర్వాత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ భారత ఆటగాళ్లను ఉద్దేశించి కీలక సూచనలు చేశాడు. ఆటగాళ్లు హోటల్ రూమ్స్‌లో సమయం వృధా చేయకుండా ఈ రెండు రోజులను (మూడు రోజుల్లోనే రెండో టెస్టు ముగిసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ప్రాక్టీస్ కోసం వినియోగించుకోవాలని కోరాడు. అప్పుడే మూడో టెస్టులో భారత జట్టు పుంజుకోగలదని లిటిల్ మాస్టర్ అభిప్రాయపడ్డాడు. కాగా, మూడో టెస్టు ఈ నెల 14 నుంచి ప్రారంభం కానుంది.

డబ్ల్యూటీసీ టేబుల్లో టాప్‌లోకి సౌతాఫ్రికా

శ్రీలంకను క్లీన్‌స్వీప్ చేసిన సౌతాఫ్రికా

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల టేబుల్లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. శ్రీలంకను రెండు టెస్టుల సిరీస్ లో 2-0తో చిత్తు చేసిన సౌతాఫ్రికా ఒకేసారి టాప్ లోకి దూసుకెళ్లింది. ఇప్పటి వరకూ ఆ స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టింది. ఈ సిరీస్ విజయంతో సౌతాఫ్రికా మరొక్క టెస్టులో గెలిస్తే చాలు డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుతుంది. ఆస్ట్రేలియా చేతుల్లో టీమిండియా రెండో టెస్టులో ఓటమి.. ఇటు శ్రీలంకపై సౌతాఫ్రికా క్లీన్ స్వీప్ తో డబ్ల్యూటీసీ పాయింట్ల టేబుల్ మారిపోయింది. తొలి స్థానంలోకి వెళ్లిన సౌతాఫ్రికా.. ఇప్పుడు పాకిస్థాన్ తో జరగబోయే రెండు టెస్టుల్లో ఒకదాంట్లో గెలిచినా ఫైనల్ వెళ్తుంది. డిసెంబర్ 26 నుంచి సౌతాఫ్రికా, పాకిస్థాన్ రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. సఫారీలు ఫస్ట్ ప్లేస్ లోకి వెళ్లడంతో ఆస్ట్రేలియా రెండు, టీమిండియా మూడో స్థానంలో కి పడిపోయాయి. ఈ సిరీస్ ఓటమితో శ్రీలంక మాత్రం ఫైనల్ రేసు నుంచి దాదాపు తప్పుకున్నట్లయింది. సౌతాఫ్రికా ఈ డబ్ల్యూటీసీ సైకిల్లో 10 టెస్టులు ఆడి ఆరు గెలిచి, మూడు ఓడిపోయింది. ఒకటి డ్రా అయింది. 76 పాయిం ట్లు, 63.33 పర్సెంటేజ్ తో టాప్ లో ఉంది. ఇక ఆస్ట్రేలియా టీమ్ 14 మ్యాచ్ లు ఆడి 9 గెలిచింది. మరో నాలిగింట్లో ఓడగా.. ఒకటి డ్రా అయిం ది. 102 పాయింట్లు, 60.71 పర్సెంటేజ్ తో రెండో స్థానంలో ఉంది. టీమిండియా విషయానికి వస్తే 16 టెస్టుల్లో 9 గెలిచి, ఆరు ఓడింది. ఒకటి డ్రా అయింది. 110 పాయింట్లు, 57.29 పర్సెంటేజ్ తో మూడో స్థానంలో ఉంది.

భారత్‌కు వెళ్లి..

ఓడించాలి: షోయబ్ అక్తర్

పాకిస్థాన్ వేదికగా 2025 లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ పై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఆ దేశంలో పర్యటించేది లేదని ఇప్పటికే బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించడానికి ససేమిరా అంటూ వచ్చిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఎట్టకేలకు దిగి వచ్చింది. పాక్లో పర్యటించడానికి భారత్ నిరాకరిస్తున్న నేపథ్యంలో ఐసీసీ చెప్పినట్లే ఆ జట్టు మ్యాచ్లను తటస్థ వేదికలో నిర్వహించేలా హైబ్రిడ్ పద్ధతికి అంగీకరిస్తామని పీసీబీ తెలిపింది. ఈ విషయంలో పాక్ బోర్డు ఓ మెలిక పెట్టింది. భవిష్యత్తులో తమ జట్టు కూడా ఐసీసీ టోర్నీల కోసం భారత్ కు వెళ్లకూడదని నిర్ణయిస్తే.. ఆ మ్యాచ్లను తటస్థ వేదికల్లో నిర్వహించేలా తమకు హామీ ఇవ్వాలని పేర్కొంది. ఈ నిర్ణయాన్ని ఆ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్ష్య తిరేకించాడు. ఓ క్రీడా ఛానల్ మాట్లాడుతూ.. ఛాంపియన్స్ ట్రోఫీపై ఆసక్తికర వ్యాఖ్య చేశాడు. హైబ్రిడ్ మోడల్లో నిర్వహించే ఈ టోర్నీ రెవెన్యూలో అధిక వాటాను పీసీబీ డిమాండ్ చేయడాన్ని షోయబ్ అక్తర్ సమర్థించాడు. ఇది సరైన నిర్ణయమేనని పేర్కొన్నాడు.



పీసీబీకి మద్దతు ఇవ్వండి..!

సమస్యలు ఉన్నప్పటికీ భారత్‌లో పాక్ ఐదుసార్లు పర్యటిం చింది

పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది

వచ్చే ఏడాది జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించిన సమస్య ఇంకా అలాగే ఉంది. టీం ఇండియాను పాకిస్థాన్‌కు పంపడాన్ని బీసీసీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. వచ్చే ఏడాది జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించిన సమస్య ఇంకా అలాగే ఉంది. టీం ఇండియాను పాకిస్థాన్‌కు పంపడాన్ని బీసీసీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అదే సమయంలో పాకిస్తాన్ కూడా హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరించడం లేదు. దీనికి సంబంధించి నేడు పెద్ద నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. అయితే దీనికి ముందు పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది ఓ ట్వీట్‌తో పీసీబీకి మద్దతు తెలియజేశాడు. పాకిస్థాన్ వెళ్లేందుకు టీమిండియాకు భారత ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేస్తూ బీసీసీఐ ఐసీసీకి మెయిల్ రాసింది. ఈ విషయాన్ని ఐసీసీ పీసీబీకి తెలియజేసింది. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ప్రమాదంలో పడింది. హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించాలంటుంది.

ఇస్కాన్.. మేడిన్ అమెరికా

అది తెల్లోళ్ల రాజ్యం.. భారత్ అన్నా, ఇక్కడి సంస్కృతి అన్నా పెద్దగా తెలియని ప్రజలు వాళ్లు.. ప్రపంచానికే దిక్సూచిగా నిలిచిన వసుధైక కుటుంబం అంటే అర్థమూ తెలియని వ్యక్తిత్వం వాళ్లది.. అలాంటి అమెరికా ఇప్పుడు భారతీయతను తనలో కలుపుకున్నది. 1893లో స్వామి వివేకానంద ప్రసంగం వాళ్లకు భారత సంస్కృతిని పరిచయం చేస్తే.. భారతీయ జీవన విధానం, ఆధ్యాత్మిక విధానం అంటే ఏంటో పరిచయం చేసింది.. ఇస్కాన్. భగవద్గీత గొప్పదనాన్ని, శ్రీ కృష్ణుడి లీలలను ప్రపంచానికి పరిచయం చేసింది.. ఇస్కాన్. అసలు ఇస్కాన్ పుట్టిందే అమెరికాలో అంటేనే అర్థం చేసుకోవచ్చు.. దాని ఘనత.

బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రతినిధి చిన్మయ్ అరెస్టుతో.. ఇస్కాన్ వార్తల్లో నిలిచింది. అసలు ఇస్కాన్ అంటే ఏంటి? దీన్ని ఎవరు స్థాపించారు? ఈ సంస్థ ఏ స్థాయి వరకు విస్తరించింది? అన్న అనేక ప్రశ్నలకు సమాధానాలివిగో.. 1965లో శ్రీకృష్ణ భగవానుడి సందేశాన్ని పాశ్చాత్య దేశాలలో వ్యాప్తి చేయడం కోసం శ్రీల ప్రభుపాదులు బృందావన్ నుంచి బయలుదేరారు. ట్రంకుపెట్టె నిండా శ్రీకృష్ణుని పుస్తకాలు, జేబులో కొంత డబ్బుతో అమెరికాలోని బోస్టన్‌లోకి ప్రవేశించారాయన. మొదట్లో చాలా కష్టాలు పడ్డా కొద్దిరోజుల్లోనే ప్రజలు ఆయనను గమనించడం మొదలుపెట్టారు. కొంతమంది ఆసక్తిగల ఆధ్యాత్మిక వేత్తలు ఆయన పట్ల ఆకర్షితులయ్యారు. 1966 వరకు న్యూయార్క్‌లోనే నివసించిన ఆయన.. అక్కడే ఇస్కాన్‌ను స్థాపించారు. ఇస్కాన్ అంటే.. ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్. దీన్నే హరేకృష్ణ ఉద్యమం అని కూడా అంటారు. ఈ సంస్థ భగవద్గీతను ప్రచారం చేస్తూ.. శ్రీకృష్ణుడి తత్వాన్ని వ్యాప్తి చేస్తుంది. 1966-1968 కాలంలో ఎక్కువ మంది అనుచరులు ఇస్కాన్‌లో చేరారు. ఫలితంగా.. లాస్ ఏంజెలిస్, సీటెల్, శాన్ ఫ్రాన్సిస్కో శాంటా ఫే, మాంట్రియల్, న్యూ మెక్సికో వంటి నగరాల్లో ఇస్కాన్ దేవాలయాలు ప్రారంభమయ్యాయి. శాన్‌ఫ్రాన్సిస్కోలో తొలి రథయాత్ర కూడా జరిగింది. 1969 - 1973 మధ్యకాలంలో, కెనడా, యూరప్, మెక్సికో, ఆఫ్రికా, దక్షిణ అమెరికా భారతదేశంలో అనేక దేవాలయాలను ప్రారంభించారు. 1970 నుంచి 1977 వరకు ఇస్కాన్ భారతదేశంలోని బృందావన్ సహా అనేక ప్రధాన తీర్థయాత్ర కేంద్రాలను సృష్టించింది. ముంబైలోని అతిపెద్ద దేవాలయాన్ని కూడా అదే పేరుతో నిర్మించారు.

భక్తి వేదాంత బుక్ ట్రస్ట్

శ్రీల ప్రభుపాద 1972లో భక్తివేదాంత బుక్ ట్రస్ట్ అనే పబ్లిషింగ్ హౌస్‌ని స్థాపించారు. ఈయన 1966-1977 మధ్య 40-సంపుటాల కృష్ణ సాహిత్యాన్ని సంస్కృతం నుంచి ఆంగ్లంలోకి మార్చారు. శ్రీమద్ భాగవతం, శ్రీకృష్ణుని అవతార చరిత్ర 18-సంపుటాలు, శ్రీ చైతన్య కారితామృత 9-సంపుటాలు, శ్రీ చైతన్య మహాప్రభు బోధనా పద్ధతులు.. ఇలా భక్తివేదాంత బుక్ ట్రస్ట్ ద్వారా అనేక పుస్తకాలు 50 భాషలలో జారీ చేయబడ్డాయి. 1977లో శ్రీల ప్రభుపాద తన భౌతిక శరీరాన్ని విడిచిపెట్టడానికి ముందు.. ఇస్కాన్‌దాదాపు 108 దేవాలయాలు, విద్యాసంఘాలు, కేంద్రాలు, 10,000 మందికి పైగా సభ్యులను కలిగి ఉంది.

విప్లవాత్మకంగా హరేకృష్ణ ఉద్యమం

శ్రీల ప్రభుపాద తన ఉద్యమానికి వెన్నెముక అని పిలిచే బ్యాక్ టు గాడ్ హెడ్ అనే మాసపత్రికను ప్రచురించారు. 1970ల్లో దాని సర్క్యులేషన్ గరిష్టంగా ఉన్నప్పుడు, ప్రతి సంచికకు లక్షల కాపీలు అమ్ముడయ్యాయి. హరే కృష్ణ ఉద్యమం 1989లో మాజీ సోవియట్ యూనియన్‌లో విప్లవాత్మక మార్పుగా కనిపించింది. రష్యాలో చాలామంది ఇస్కాన్ పట్ల ఆకర్షితులయ్యారు. ఇంజినీర్ల నుంచి సాంకేతిక నిపుణుల వరకు ఇస్కాన్ వైపు మళ్లారు. అయితే.. ఆ సమయంలో హరే కృష్ణ అని పలికినందుకు ఎంతోమందిని జైల్లో పెట్టారు రష్యా నాయకులు. ఇస్కాన్ ప్రతినిధులు అమెరికా సీఐఏ ఏజెంట్లు అన్న అనుమానంతో పలువురు భక్తులను కూడా అరెస్టు చేశారు. కొంతమంది భక్తులను మానసిక చికిత్స కేంద్రాలకు కూడా పంపారు. గీతను రష్యన్ భాషలోకి అనువదించిన ఓ గర్భిణిని జైల్లో పెట్టారు. అయితే.. ఇస్కాన్, శ్రీకృష్ణుడి తత్వం బోధపడటంతో మెల్లిమెల్లిగా అక్కడి పాలకుల్లోనూ మార్పు వచ్చింది. రష్యా పాలకులు కూడా ఇస్కాన్ ఆధ్యాత్మిక పరిమళాలను ఆస్వాదించారు. ఒకరకంగా ఇస్కాన్‌కు ఎక్కువగా భక్తులు ఉన్నది రష్యాలోనే. ప్రస్తుతం, ఇస్కాన్ ప్రపంచవ్యాప్తంగా 500 కంటే ఎక్కువ కేంద్రాలను కలిగి ఉంది.



(ఇస్కాన్ ప్రతినిధుల సహకారంతో..)

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..
సంస్కృతిని కాపాడే లక్ష్యంగా..
మన ఔన్నత్యాన్ని పెంచేలా..
మన ఔచిత్యాన్ని చాటేలా..
తెలుగు చరిత్రలోనే తొలిసారి..
ధర్మం కోసం అక్షర తపస్సు చేస్తూ..
తెలుగు ప్రజల కోసం వస్తున్నది..

"ఋషి తెలుగు దినపత్రిక"

'కురుక్షేత్రం' అన్న పేరుతో..
సంపాదకీయాన్ని తీసుకొస్తున్నది
ఆసక్తి కలిగిన రచయితలు..
ధర్మ పరిరక్షకులు..
ఈ అక్షర యజ్ఞంలో
పాలుపంచుకోవాలని విజ్ఞప్తి.
కురుక్షేత్రం పేజీ కోసం తమ
వ్యాసాలు పంపి
మరింత మందికి జ్ఞానాన్ని
ప్రసాదించాలని వినతి.

కాపాడుకుందాం
**మన దేశాన్ని!
మన ధర్మాన్ని!!**

గోవింద.. నామ విశిష్ఠత

ఏడుకొండలవాడా.. వెంకటరమణా.. గోవిందా.. గోవిందా... అని ఆ తిరుమల వెంకన్నను మనస్ఫూర్తిగా తలుచుకుంటాం. కానీ.. కొందరికి గోవిందా.. అన్న పదం తిట్టుగా మారిపోయింది. అంతా అయిపోయిందన్న సందర్భంలో గోవిందా అన్న పదాన్ని వాడుతున్నారు. అయితే.. గోవిందా అనే పేరు ఎలా వచ్చింది? దాని విశిష్ఠత ఏంటి? అంటే.. ముందుగా గోకులం నాటి కథ తెలుసుకోవాలి. ఇంద్రుడు దేవతల అధిపతి, పరమ గర్విష్టి. వానల కోసం గోకులంలో పెద్దలు ఇంద్రయాగం అని చేస్తుండేవారు. ఒకరోజు గోకులంలో పెద్దలంతా ఇంద్రయాగం చేయతలపెట్టారు. గోకులంలోని ప్రజలంతా ఇంద్రుని పూజించుకునేందుకు సిద్ధపడుతుంటే అలాంటి అవసరం ఏదీ లేదంటూ కృష్ణుడు వారిని వారిస్తాడు. ఏటా వర్షఋతువు కోసం గోకులంలో గోపాలురు ఇంద్రుడికి యజ్ఞయాగాదులు చేసుకుంటూ పిండివంటలు చేసి ఇంద్రుడికి అర్పించే పద్ధతి ఉండేది. అయితే కృష్ణుడి ఇదేంటో తెలుసుకోవాలని కూతుహలపడి, పెద్దలను ఆడిగాడు. అయితే వారు వర్షాలు ఇచ్చే వరణుడు, ఇంద్రుడి ఆధీనంలోనే ఉంటాడు.. ఆ వర్షాలు వస్తేనే కదా మనకు పంటలు పండుతాయి.. గోవులకు ఆహారం లభిస్తుంది.. అంటూ వివరిస్తారు. ఆ ఇంద్రుడు ఇవ్వాలన్నా తాను వెనకనుండి ఇస్తేనేకదా.. ఇవ్వగలడు అని, ఆ ఇచ్చేవాన్ని నేనిక్కడే ఉండగా నన్ను కాదని చేస్తున్నారే అని శ్రీకృష్ణుడు అనుకున్నాడు. ఇంద్రునికి కాకుండా.. ప్రకృతికి నిలయాలపైన పర్వతాలే దైవనిర్ణితములు అని, పర్వతాలకు ప్రార్థనలతో పిండి వంటు అర్పించాలని చెప్పి, ఆ పద్ధతే చేయించాడు. దీంతో ఇంద్రుడు ఆగ్రహించి.. తన కోపాన్ని ప్రదర్శించేందుకు ఇంద్రుడు వారి మీద ఉరుములు, పిడుగులతో భీకర వర్షాన్ని కురిపిస్తాడు. 7 రోజులు ఏకధాటిగా తెరిపిలేకుండా ప్రళయాన్ని సృష్టిస్తాడు. దీంతో గోకులంలోని ప్రజలంతా శ్రీకృష్ణుడికి మొరపెట్టుకొన్నారు. అప్పటికి ఏడేండ్ల వయసున్న శ్రీకృష్ణుడు.. వారికి ధైర్యాన్నిచ్చి.. గోవర్ధన పర్వతాన్ని ఎత్తి గోకులాన్నంతా కాపాడాడు. దీంతో ఇంద్రుడికి గర్వభంగం అయ్యింది. అప్పుడు బ్రహ్మ, ఇంద్రాది దేవతలు శ్రీకృష్ణుడికి క్షమాపణ చెప్పి పాదాలు కడిగారు. అప్పటినుంచే స్వామి పాదాలు బ్రహ్మకడిగిన పాదాలుగా భక్తుల చేత కీర్తి పొందాయి. ఆ ఏడు రోజులు గోవర్ధన పర్వతాన్ని తన చిటికెన వేలిపై నిలబెట్టి గోపాలురు, గోవులు, గోకులాన్ని కాపాడినప్పుడు అక్కడి వాళ్లతా గోవిందా.. గోవిందా.. అంటూ జపించారు. గోవులన్నింటినీ రక్షించిన కృష్ణుని పట్ల కృతజ్ఞతగా, ఆయనను పాలతో అభిషేకించేందుకు కామధేనువు పూనుకుంటుంది. అది చూసిన ఇంద్రుడు.. గంగాజలంతో కృష్ణుడిని అభిషేకించాలని తన ఐరావతాన్ని ఆజ్ఞాపిస్తాడు. అనంతరం.. గోవులకు కూడా మీరు అధిపతి అని.. అందువల్ల గోవిందుడిగా పిలుస్తారని ఇంద్రుడు చెప్తాడు. అప్పటి నుంచి కృష్ణుడు గోవిందుడు అన్న నామంతో పూజలు అందుకుంటున్నాడు. గోపూజ గోవింద పూజతో సమానం. గోవింద నామం సర్వపాప హరణం.

– అలేఖ్య

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #11-5-419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 6-1-628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD-4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com